




epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com








సంపుటి : 17 సంచిక : 172 | 31-07-2025 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00


## పేదల దీవెనలతోనే ఇందిరమ్మ ప్రభుత్వం: మంత్రి పొంగులేటి

అక్షర కలం:ఖమ్మం/ నేలకొండపల్లి :



పేదల దీవెనలతోనే ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ%ూ% గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఆ ప్రభుత్వ తప్పిదాల వల్ల కోట్లాది పేదలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల మందిని కొత్తగా పాత కార్డుల్లో చేర్చామని తెలిపారు. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి, మూడు నెలలకు ఒకేసారి ఇచ్చామని గుర్తుచేశారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరి అనిపించగా, ఇప్పటి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందని చెప్పారు. పది నెలల్లో 21 వేల కోట్ల రుణమాఫీ జరిపినట్లు పేర్కొన్నారు. మహిళల సంక్షేమంపై దృష్టి సారించామని, ఉచిత బస్సు ప్రయాణానికి 5 వేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తూ భారంగా భావించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయని, మూడు విడతల్లో పేద కుటుంబాలకు ఇళ్లు అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. "ప్రతి అర్హుడికి ఇల్లు ఇచ్చే బాధ్యత నాది. పేదల ఇంటి పెద్ద కొడుకులా నేను మీతో ఉంటాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేష్‌గౌడ్ భేటీ..



### కీలక అంశాలపై చర్చ

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇవాళ(బుధవారం జులై 30) భేటీ అ య్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. పార్టీ నిర్మా ణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణపై మాట్లా డారు. దాదాపు గంటన్నరపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల(జులై) 31వ తేదీ నుంచి వచ్చే నెల (ఆగస్టు) 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టనుంది.

వార్త 2లో

## సింధూ జలాల ఒప్పందం...



కీలక ప్రకటన చేసిన జై శంకర్
సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కొనసాగుతోందని వెల్లడి
నీరు, రక్తం కలిసి ప్రవహించవని పునరుద్ఘాటన
నెహ్రూ హయాంలో జరిగిన తప్పిదాలను మార్చవచ్చని మోదీ నిరూపించారని వ్యాఖ్య

వార్త 2లో

## జమ్ము కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ఇద్దరు తీవ్రవాదులు హతం



శ్రీనగర్:

జమ్మూ కశ్మీర్ ప్రాంతం పూంచ్‌లో బుధవారం ఉదయం ఎన్ కౌంటర్ జరిగింది. భద్రత బలగాలు, తీవ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పూంచ్ ప్రాంతంలోని జెన్‌లో కంచె వెంబడి బుధవారం అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తుల కదలికలను భద్రతా బలగాలు గుర్తించాయి. తొలుత భద్రతా బలగాల వినికిడి రావడంతో తీవ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు జరిపిన కాల్పులు ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాంలో పాల్గొన్న ముగ్గురు తీవ్రవాదులను భద్రతా బల గాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. పహల్గాం దాడికి పాల్ప డిన సులేమాన్‌తో పాటు అతడి ఇద్దరు అనుచరులు హతమయ్యారు.

## ఇజ్రాయిల్‌కు బ్రిటన్ వార్నింగ్

-హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి



పాలస్తీనాపై ఇజ్రాయిల్ పాశవిక దాడుల విషయం తెలిసిందే. ఇచ్చలవిడి బాంబులు, ఫైటర్ జెట్లలతో దాడులు చేస్తు భారీగా మానవ హననానికి పాల్పడుతుంది. ఇజ్రాయిల్ దాడులతో గాజా శవాల దిబ్బల మారింది. ఆకలి బాధతో చిన్నారులు అలమ టిస్తున్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోయి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈక్రమంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ అరాచకాన్ని యూరప్ దేశాలు బహాటంగా ఖండిస్తున్నాయి. తాజాగా పాలస్తీనా విషయంలో ఫ్రాన్స్ దారినే బ్రిటన్ సైతం అనుసరిస్తోంది. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించకుంటే ప్రత్యేక పాలస్తీనా ఏర్పాటుకు వచ్చే సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో జరిగే సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టే తీర్మానానికి మద్దతిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ దిశగా ఇజ్రాయెల్ చర్యలు తీసుకోకుంటే పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ఆయన ప్రకటించారు.అదే సమయంలో, హమాస్ తన వద్ద ఉన్న బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని కోరారు. కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకం చేసి, ఆయుధాలను అప్పగించాలన్నారు. భవిష్యత్తులో గాజాలో ఎటువంటి భూమిక పోషించబోమనే హామీని హమాస్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇదే సరైన అదను అని స్టార్మర్ తెలిపారు. ఇటీవలే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సైతం రెండు దేశాల విధానానికి మద్దతు ప్రకటించడం గమనార్హం.



## 22 నిమిషాల్లో ప్రతికారం తీర్చుకున్నాం.. జేపీ నడ్డా

వార్త 2లో

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ 'అపరేషన్ సింధూర్'తో కేవలం 22 నిమిషాల్లో ప్రతీకారం తీర్చుకుందని, ఇది ఆన్ రికార్డ్ అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూర్ ద్వారా పీఎం మోదీ ఇచ్చిన గట్టి స్పందన ఇంతవరకూ చరిత్రలోనే లేదని అన్నారు.




2 లో..

## 20,000 మంది కొత్త వారిని నియమించుకుంటాం!

## విమర్శలు పూర్తిగా అసత్యం

### బీజేపీ నేతలకు మంత్రి తుమ్మల కౌంటర్..

హైదరాబాద్ : అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కౌంటర్ ఇచ్చారు. పంటల కాలాలు, ఎరువుల కేటాయింపు, సరఫరాలపై బీజేపీ నేతలు అవగాహన పెంచుకోవాలని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు చేస్తున్న రాజీనామ సవాళు రాజకీయల కోసం కాకుండా ఎరువుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవడానికి వాడాలని హితవు పలికారు.తమ ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ కోసం కేటాయించిన ఎరువులు గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. కానీ రాష్ట్ర బీజేపీ నాయకులు మాత్రం అరిగిపోయిన గ్రామ ఫోన్ లాగా పదే.. పదే.. 2024-25 యాసంగి గురించి మాట్లడటం వారి అవివేకానికి అద్దం పడుతుందని విమర్శించారు. కేంద్రం సప్లై చేసిన యూరియా రాష్ట్రంలో పక్కదారి పట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్? రావు ఆరోపించారు. బ్లాక్? మార్కెట్ కు తరలివెళ్లిందని నిరూపిస్తే వ్యవసాయ శాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావు రాజీనామా చేస్తారా? అని ఆయన ప్రశ్నించా రు. ఎరువుల కొరతకు సంబంధించి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విమర్శలు పూర్తిగా అసత్యమని అన్నారు.



## సెప్టెంబర్ 9న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర

హైదరాబాద్: ఉత్తర భారత దేశంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి సెప్టెంబర్ 9న భారత గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రైల్వే సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రైలుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర రైలు చెన్నై నుంచి బయలుదేరి ఏపీలోని గూడూరు, నెల్లూరు ఒంగోలు, చీరాల, గుంటూరు, తెలంగాణలోని మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్( , కాజీపేట రైల్వే స్టేషన్లలో ఆగుతుందని, ప్రయాణికులు ఈ రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కవచ్చని తెలిపారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధాపూర్, మథుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసీ, గయా వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని ఆయన తెలిపారు. 9355021516 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి టికెట్లు కొనవ చ్చునని ఆయన తెలిపారు.

# సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేష్‌గౌడ్ భేటీ..

## కీలక అంశాలపై చర్చ

**హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇవాళ(బుధవారం జులై 30) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణపై మాట్లాడారు. దాదాపు గంటన్నరపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల(జులై) 31వ తేదీ నుంచి వచ్చే నెల (ఆగస్టు) 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టనుంది. ఆగస్టు 5,6,7 మూడురోజుల పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికై ఢిల్లీలో కార్యాచరణ రూపొంది ంచారు. ఆగస్టు 5వ తేదీన పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకత్వం, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు. ఆగస్టు 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేక రైలులో ప్రతీ నియోజకవర్గం నుంచి 50 మంది కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. ఢిల్లీ పర్యటన అనంతరం తెలంగాణలో యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగనుంది.

# సింధూ జలాల ఒప్పందం...

### కీలక ప్రకటన చేసిన జై శంకర్

### సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కొనసాగుతోందని వెల్లడి

### నీరు, రక్తం కలిసి ప్రవహించవని పునరుద్ఘాటన

### నెహ్రూ హయాంలో జరిగిన తప్పిదాలను మార్చవచ్చని మోదీ నిరూపించారని వ్యాఖ్య

**హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కొనసాగుతోందని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని ఆయన పునరు ద్ఘాటించారు. బుధవారం నాడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడే వరకు ఈ నిలిపివేత కొనసా గుతుందని తేల్చి చెప్పారు. సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో అధికారంలో ఉన్న పాలకులు భారత రైతుల ప్రయో జనాల కంటే పాకిస్థాన్ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శించారు. నెహ్రూ హయాంలోని తప్పిదాలను సరిదిద్దలేమని గతంలో 60 ఏళ్లు పాలించిన వారు చెబుతూ వచ్చారని, అయితే మోదీ ప్రభుత్వం వాటిని మార్చవచ్చని నిరూపించిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సింధూ జలాల ఒప్పందంపై తీసుకున్న చర్యలు ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను ఐక్యరాజ్యసమితి తొలిసారి తన నివేదికలో ప్రస్తావించిందని ఆయన గుర్తు చేశారు.

# ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరుగులు

## మొత్తం 70 గేట్లను ఎత్తిన అధికారులు

**విజయవాడ,**

కృష్ణమ్మ పరుగులు తీస్తోంది.. కృష్ణా బేసిన్ లోని అన్ని ప్రాజెక్టులు నిండిపోవడంతో.. ప్రకాశం బ్యారేజీ వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది .. అయితే, అంతకంతకు నీటి ప్రవాహం పెరుగుతుండడంతో.. అధికారులు అప్రమత్తం అయ్యారు.. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం పెరుగుతోన్న నేపథ్యంలో.. మొత్తం 70 గేట్లను అధికారులు ఎత్తివేశారు.. అందులో 15 గేట్లను 2 అడుగుల మేర, మిగతా 55 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి సముద్రంలోకి నీటిని వదులుతున్నారు.. బ్యారేజీ నీటిమట్టం 12 అడుగులకు చేరగా.. ప్రమత్తమైన అధికారులు.. బ్యారేజీ కెపాసిటీ– 3.07 టీఎంసీలు దాటకుండా జాగ్రత్త పడుతున్నారు.. సముద్రంలోకి 60,875 క్యూసెక్కుల నీరు వెళ్తుండగా.. కృష్ణా తూర్పు కాలువకు 10,207 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ కాలువకు 5527 క్యూసెక్కుల నీరు.. గుంటూరు ఛానెల్ కు 200 క్యూసెక్కుల నీరు.. ఇలా మొత్తం ఇన్ ఎ÷–లో, ఔట్ ఎ÷–లో 72,909 క్యూసెక్కులుగా ఉంది.. అంటే.. ఇన్‌ఎ÷–లో రూపంలో వస్తున్న నీటిని మొత్తం.. అదే తరహాలో బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

# సింగపూర్‌లో బిజీగా చంద్రబాబు

## వివిధ సంస్థలతో వరుస భేటీలు

## పెట్టుబడులకు పలు సంస్థల ఆసక్తి

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనలో నాలుగో రోజున వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టె–మసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో వేర్వేరుగా సీఎం చంద్రబాబు బృందం భేటీ–అయ్యారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజిటల్ టౌన్ షిప్స్ వంటి అంశాలపై కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు సంజీవ్ దాస్ గుప్తా, గౌరిశంకర్ నాగభూషణంలతో సీఎం చంద్రబాబు బృందం చర్చించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటు–కు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని సమావేశంలో సీఎం చంద్రబాబు వివరించారు. తమ సంస్థ నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ఏపీని ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా పరిగణిస్తామని కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు తెలిపారు. వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయో డైవర్సిటీ– కాంప్లెక్సులు, వైల్డ్ లైఫ్ ఎక్స్‌పీరియెన్స్ జోన్ల ఏర్పాటు– వంటి అంశాలపై మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ ప్రతినిధి మైక్ బార్క్ లేతో చంద్రబాబు మాట్లాడారు. ఏపీలో ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు బార్క్ లే సముఖత వ్యక్తం చేశారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో సమాలోచనలు చేశారు సీఎం చంద్రబాబు. వివిధ ప్రాజెక్టుల్లో అవసరమైన ఆర్థిక భాగస్వామ్యంపై ÷ూఃఇఈ ప్రతినిధితో చర్చించారు. ఫైనాన్స్, ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లెండింగ్, క్లీన్ ఎనర్జీ ఫైనాన్సింగ్ వంటి రంగాలపై తాము ఆసక్తితో ఉన్నామని చంద్రబాబుకు ప్రతినిధి రాజీవ్ కన్నన్ వివరించారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్య ఆరోగ్యం, టెక్నాలజీ, సుస్థిర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై టెమసెక్ హెల్డింగ్స్ ప్రతినిధి దినేష్ ఖన్నాతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. వివిధ రంగాల్లో పెట్టుబడుల విస్తరణకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని దినేష్ ఖన్నా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో పెట్టు–బడులు పెట్టే అంశంపై ఎంఓయూలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామని దినేష్ ఖన్నా హామీ ఇచ్చారు.---------------------

# 22 నిమిషాల్లో ప్రతికారం తీర్చుకున్నాం.. జేపీ నడ్డా

**న్యూఢిల్లీ: అక్షరకలం ప్రతినిధి**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ 'ఆపరేషన్ సింధూర్'తో కేవలం 22 నిమిషాల్లో ప్రతీకారం తీర్చుకుందని, ఇది ఆల్ రికార్డ్ అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూర్ ద్వారా పీఎం మోదీ ఇచ్చిన గట్టి స్పందన ఇంతవరకూ చరిత్రలోనే లేదని అన్నారు. ఆపరేషన్ సింధూర్, పహల్గాం ఉగ్రదాడిపై రెండోరోజైన బుధవారంనాడు రాజ్యసభలో కొనసాగిన చర్చలో నడ్డా మాట్లాడారు. 26/11 ముంబై పేలుళ్ల ఘటనను ఆర్ఎస్ఎస్‌తో కాంగ్రెస్ ముడిపెట్టడంపై నడ్డా మండిపడ్డారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఆయన సారథ్యంలోని యూపీఏ ప్రభు త్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ, వారణాసి, ముంబై ఉగ్రదా దులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇది అప్పటి ప్రభుత్వ అచేన త్వాన్ని చాటుతుందని అన్నారు. ఆక్సాయ్ చిన్‌పై పార్లమెంటులో అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన వ్యాఖ్యలను కూడా నడ్డా తప్పుప ట్టారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను విడగొట్టిన ఇందిరాగాంధీకి మనం కృతజ్ఞతలు చెబుతున్నామని, కానీ సిమ్లా ఎగ్రిమెంట్‌తో 15,000 చదరపు కిలోమీటర్ల భూమిని పాక్‌కు కట్టబెట్టారని విమర్శించారు. అసలు విషయం ఇలా ఉంటే పాకిస్థాన్‌కు కేంద్రం లొంగిపోయిందంటూ తమను విమర్శించడం విడ్డూరమన్నారు.

# 20,000 మంది కొత్త వారిని నియమించు కుంటాం!:

### 2025లో కొత్త వారిని నియమించుకోనున్నట్లు

### ప్రకటించిన సలీల్ పరేఖ్

### మొదటి త్రైమాసికంలో 17,000 మందిని నియమించుకున్నట్లు వెల్లడి

### 2.75 లక్షల మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ: అక్షరకలం ప్రతినిధి**

ఈ సంవత్సరం 20,000 మంది కొత్త నియామకాలు చేపట్టాలని భావిస్తున్నట్లు ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. 2025లో 20 వేల మంది కాలేజీ గ్రాడ్యుయేట్లను నియమించుకుంటామని ఆయన పేర్కొన్నట్లు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి త్రైమాసికంలో ఇప్పటికే 17,000 మందిని నియమించుకున్నట్లు ఆయన తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), రీస్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించినట్లు సలీల్ పరేఖ్ వివరించారు. ఇన్ఫోసిస్ ఏఐ సాంకేతికతను ముందుగానే అంది పుచ్చుకుందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు ఏఐ, సంబంధిత రంగాలలో 2.75 లక్షల మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇన్ఫోసిస్ కంపెనీ, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యూహంతో పనిచేస్తోందని సలీల్ పరేఖ్ స్పష్టం చేశారు. ఐటీ రంగంలో ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఇన్ఫోసిస్ ఉద్యోగ నియామకాలు చేపట్టడం విశేషం. ఇటీవల టీసీఎస్ 12,000 మంది ఉద్యోగులను తొలగి ంచనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది దేశీయ ఐటీ పరిశ్రమలో ఇప్పటివరకు అతిపెద్ద తొలగింపుగా భావిస్తున్నారు.

# రష్యాలో భారీ భూకంపం

### రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదు

### సునామీ హెచ్చరికల జారీ

### రష్యా తీరంతో పాటు, జపాన్‌పైనా ప్రభావం

### అత్యవసర హెచ్చరికలు జారీ

### సైరన్ల మోతతో వీధుల్లోకి వచ్చిన జనం

**మాస్కో**




రష్యాలో భారీ భూకంపం బుధవారం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదైనది. రష్యా తీరంలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు– జపాన్‌కు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. 3 మీటర్ల ఎత్తులో అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అమెరికాలో 2011లో సంభవించిన తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద భూకంపం అని అధికారులు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని రష్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. భూకంపనాలకు ప్రజలు భయాందోళనతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఇళ్లలోని క్యాబినెట్‌లు కూలిపోవడం, అద్దాలు విరిగిపోవడం, రోడ్లపై నిలిపిన కార్లు ఊగడం వంటి సిసి టివి ఫుటేజీలు విడుదల అయ్యాయి. ఈ నెలలో రష్యాలో అనేక భూకంపాలు సంభవించాయి. జూలై 20న రష్యాలో ఒక గంటలోపు ఐదు భూకంపాలు సంభవించాయి. భూకంప తీవ్రతకు పసిఫిక్ మహాసముద్ర తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తూర్పు జపాన్ లో రైల్వే సర్వీసులు నిలిపివేశారు. అమెరికా, ఫిలిపీన్స్, ఈక్విడార్ లకు సునామి హెచ్చరికలు జారీ చేశారు. కాలిఫోర్నియా నుంచి వాషింగ్టన్ వర్క్ సముద్ర తీర ప్రాంతాల్లో అలర్ట్ జారీ చేశారు. యుఎస్ జియోలాజికల్ సర్వే భూకంప వార్తలను ధృవీకరించింది. భూకంపం వలన ఆయా దేశాల ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యానికి తీవ్ర అంతరాయం కలిగింది. రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 8.8గా నమోదైంది. జపాన్ వాతావరణ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈక్రమంలోనే రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంతో పాటు– జపాన్‌కు కూడా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ హెచ్చరికలు చేసిన కొద్దిసేపటికే రష్యా, జపాన్‌లను సునామీ తాకింది. జపాన్‌లోని నాలుగు పెద్ద దీవులకు ఉత్తరాన ఉన్న హక్కైడో నుంచి దాదాపు 250 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు– అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలియలేదు. భూప్రకంపనల నేపథ్యంలో పెట్రోపావ్లోవ్స్క్– కామ్చాట్స్కీ నగరంలోని భవనాలు కంపించాయని రష్యా మీడియా తెలిపింది. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీసినట్లు పేర్కొంది. కామ్చాట్స్కీ ప్రాంతంలో విద్యుత్, సెల్‌ఫోన్ సేవల్లో అంతరాయాలు ఏర్పడినట్లు– వివరించింది. అత్యవసర సేవల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటుచేసినట్లు– జపాన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రకంపనలకు సంబంధించిన తీవ్రతను తెలిపే వీడియోలు తాజాగా బయటకు వచ్చాయి. ప్రపంచంలోనే ఈ స్థాయిలో భూకంపం రావడం 2011 తర్వాత మళ్లీ ఇప్పుడే. సునామీ హెచ్చరిక సైరన్లు మోగడంతో భయాందోళనకు గురైన ప్రజలు నివాస ప్రాంతాలను వీడుతున్నారు. స్థానిక గవర్నర్ వాలెరీ లిమారెంకో ప్రకారం.. సునామీ మొదట రష్యాలోని కురిల్ దీవులలోని ప్రధాన స్థావరమైన సెవెరో–కురిల్స్క్ తీర ప్రాంతాన్ని తాకింది. ఇక్కడి ఓడరేవు మునిగిపోయింది. ఈ ప్రాంతంలో దాదాపు 2వేల మంది ప్రజలు నివసిస్తున్నారని రష్యా అత్యవసర మంత్రిత్వశాఖ తెలిపింది. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు– వెల్లడించింది. సఖాలిన్ ద్వీపంలోని నివాసితులను ఖాళీ చేస్తున్నామని, అత్యవసర సేవలు పూర్తిసామర్థ్యంతో పనిచేస్తున్నాయని స్థానిక రష్యన్ అధికారి తెలిపారు. ఇక, సునామీ కారణంగా జపాన్‌లో 3 మీటర్ల వరకు అలలు ఎగసిపడుతున్నాయని అక్కడి వాతావరణ శాఖ తెలిపింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎవరూ సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరికలు చేసింది.

# సునామితో భారీగా ఎగిసిపడ్డ అలలు

### తీరానికి కొట్టుకు వచ్చిన తిమింగలాలు

### జపాన్ తీర ప్రాంతాన్ని అప్రమత్తం చేసిన అధికారులు

**మాస్కో**

సునామీ దెబ్బకు భారీ తిమింగలాలు తీరానికి కొట్టుకొచ్చి పడ్డాయి. రష్యా లో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా చుట్టుపక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకుపడ్డాయి. పసిఫిక్ సముద్రంలో పుట్టుకొచ్చిన సునామీ జపాన్‌ను కూడా తాకింది. సముద్రంలో కల్లోలం తీవ్రతకు నీటి మధ్యలో ఉండాల్సిన భారీ తిమింగలాలు తీరంలోకి విసిరేసినట్లు పడ్డాయి. జపాన్‌లోని చింబా తీరంలోని దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు ఇప్పటికే రేడియేషన్ లీకేజీతో సమస్యాత్మకంగా మారిన ఫుకుషిమా డయిచీ అణుకేంద్రం నుంచి ఉద్యోగులను బయట సురక్షిత ప్రదేశాలకు తరలించారు. ఇప్పటికే జపాన్‌లోని పసిఫిక్ తీరంలో ఉన్న కొన్ని దీవులను సునామీ అలలు చేరుకొన్నాయి. టొకచాయ్ పోర్టులో 40 సెంటీమీటర్ల అలలు రాగా.. ఎరిమో పట్టణంలో 30 సెంటీమీటర్ల మేర అలలు వచ్చాయి. దీంతోపాటు– థోకు, కాంటో ప్రాంతాల్లో కూడా భారీ అలలు కనిపించాయి. హన్సంకిలో 30 సెంటీమీటర్ల ఎత్తున అలలు వచ్చినట్లు– ఎన్‌హెచ్‌కే పేర్కొంది. ఇషినోమొకి పోర్టులో 50 సెంటీ–మీటర్ల అలలు వచ్చాయి. ఇక తీర ప్రాంతాలకు సమీపంలో ఉన్న జపాన్ ఎయిర్ పోర్టులు కూడా సునామీ హెచ్చరికలతో అప్రమత్తమయ్యాయి. ఈశాన్య జపాన్‌లోని సెండాయ్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ ప్రాంతానికి వచ్చే విమానాలను దారి మరల్చారు. జపాన్ తీరంలో, 2011 మార్చిలో 9.0 తీవ్రతతో వచ్చిన శక్తిమంతమైన భూకంపం భారీ సునామీకి కారణమయ్యింది. ఆ సమయంలో సముద్ర అలలు 130 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఎగిశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ విపత్తులో సుమారు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు– అంచనా. మరో 2500 మంది ఆచూకీ లేకుండా పోయింది. 1.20 లక్షల ఇళ్లు పూర్తిగా నాశనం కాగా, 2.7 లక్షల నివాసాలు దెబ్బతిన్నట్లు– అంతర్జాతీయ నివేదికలు అంచనా వేశాయి. ఫుకుషిమా న్యూక్లియర్ ప్లాంటు కూడా దెబ్బతింది. దీంతో ఆ కేంద్రం తీవ్రంగా దెబ్బతిని భారీగా రేడియేషన్ లీకైంది. దీంతో కొన్నేళ్లపాటు– ఈ ప్రదేశం మొత్తం కలుషితమైంది. దీనిని శుభ్రం చేయడానికి.. కలుషితమైన నీటిని శుద్ధి చేసి సముద్రంలోకి విడుదల చేయడానికి సుదీర్ఘకాలం పట్టింది. మొత్తం జపాన్ వద్ద శుద్ధి చేసినట్లు– చెబుతున్న 1.34 మిలియన్ టన్నుల అణుజలాలు పోగుబడ్డాయి. వాటిని వివిధ దశల్లో శుద్ధి చేసి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి 30 ఏళ్లు పడుతుందని అంచనా. ఈ అణుజలాల్లో ట్రీటియం, కార్బన్–14 మూలకాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## గొర్రెల పంపిణీ కుంభకోణం కేసు

### హైదరాబాద్‌లో పలుచోట్ల ఇడి దాడులు

హైదరాబాద్,

గొర్రెల పంపిణీ కుంభకోణం కేసులో హైదరాబాద్‌లోని ఆరుచోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, ప్రధాన నిందితుడు మొయినుద్దీన్, పలువురి ఇళ్లలో అధికారులు తనిఖీలు చేశారు. తొలుత ఈ కుంభకోణంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గొర్రెల పంపిణీతో రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు- గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కయి నిధులు స్వాహా చేసినట్లు- ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు- రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు- ఏసీబీ, ఈడీ అనుమానిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో 10 చోట్ల ఈడీ దాడులు కొనసాగుతుండటం హాట్ టాపిక్‌గా మారింది. సికింద్రాబాద్, బోయిన్ పల్లి, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలతో గతంలో ఏసీబీ కేసు నమోదు చేసింది. అనంతరం ఈడీ రంగంలోకి దిగి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారడం, ఇతర రాష్ట్రాలకూ లింకులు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. అందుకే మనీ లాండరింగ్ కేసుగా ఈడీ విచారణకు స్వీకరించింది. ఇప్పటికే ఈడీ అధికారులు గొర్రెల స్కీంకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్ట్ చేశారు. గొర్రెల పంపిణీ విధివిధానాలు, ప్రభుత్వ నిధుల చెల్లింపులకు సంబంధించిన వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఈ పథకాన్ని అమలు చేయడంలో ఆర్థిక అవకతవకలు చోటు-చేసుకున్నట్లు అవినీతి నిరోధక శాఖ తన దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిన తొలినాళ్ల నుంచే కొంతమంది అధికారులు, మధ్యవర్తులు కలిసి ప్రభుత్వ నిధులను దారి మళ్లించినట్లు- సమాచారం. అసలు లబ్ధిదారులకు నిధులు అందకుండా బినామీ ఖాతాల్లోకి చేరినట్టు- ఆధారాలు లభించాయి. కొంతమంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు- రికార్డుల్లో చూపించి ఆ మొత్తాన్ని అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు- ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ హస్తమూ ఉందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

## నిధులు దారిమళ్లించిన జగన్: అచ్చన్న

విజయవాడ,

జగన్ హయాంలో రైతులకు రూపాయికే బీమా అమలు చేస్తామని జగన్ మూడేళ్ల పాటు- ప్రీమియం ఎగ్గొట్టారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అసెంబ్లీలో బీమా చెల్లించామని అబద్ధాలు చెప్పడమే కాకుండా.. జీవో కూడా లేకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. బుధవారం విజయవాడలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. రూ.3,138 కోట్ల బీమా బకాయిలు పెండింగ్‌లో ఉండేందుకు కారణం అప్పటి ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడమేనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉచిత బీమా పథకం మళ్లీ మొదలుపెట్టామని చెప్పారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో రూ.3,156 కోట్లు- జమ చేస్తామని తెలిపారు. పులివెందుల రిజర్వాయర్ నీటిని రైతులకు కాకుండా తన బంధువుల కంపెనీలకు జగన్ మళ్లించారని అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సానుకూల దృక్పథం ఆరోగ్యానికి శ్రీరామరక్ష (ఆధ్యాత్మిక చింతన )

తిరుమల, పాజిటివ్ థింకింగ్..అంటే సానుకూల దృక్పథం అని అర్థం. అంటే మనం ఎల్లవేళలా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. దీనిని అలవాటు చేసుకోవాలి. అప్పుడు ఆరోగ్యం మన ఆధీనంలో ఉంటుంది. మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని సూచించారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగగ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం.అందుకే ఋషులు అంటారు... 'మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ...నెగెటివ్ ఎనర్జీలతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి.

## స్థానిక విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

### బిసి రిజర్వేషన్ల బిల్లు గట్టెక్కితేనే నెరవేరనున్న లక్ష్యం

### పార్టీలో ఉత్సాహం నింపేందుకు నేటినుంచి మీనాక్షి పాదయాత్ర

రంగారెడ్డి,

బిసి రిజర్వేషన్లు ప్రకటించినా..రాష్ట్రపతి ఇంకా ఆమోదించలేదు. దీనిపై కేంద్రాన్ని నిందిస్తూ కాంగ్రెస్ ఉద్యమకార్యాచరణకు సిద్ధం అవుతోంది. ఢిల్లీలో ఆందోళన చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. 42శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. బిజెపి మాత్రం ఇది ఆమోదయోగ్యం కాదనిచెబుతోంది. అందులో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాలని చెబుతోంది. మొత్తంగా ఎవరి రాజకీయం వారిది. ఎవరి ఆలోచన వారిది. ఈ క్రమంలో ఆర్డినెన్స్ పాస్ కాకుంటే.. మావ్యూహం మాకుందని సిఎం రేవంత్ పదేపదే చెబుతున్నారు. అదేంటన్నది ఇప్పుడే తెలియదు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని పట్టుదలతో కాంగ్రెస్ పనిచేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు సందేశాలు వెళ్లాయి. మరోవైపు ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ జూలై31 గురువారం నుంచి పాదయాత్రకు సిద్ధం అవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టు-కుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మీనాక్షి పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు-, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు- చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లూ పాదయాత్రలో పాల్గొంటారు. దీనిని విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేవాల మేరకు సెప్టెంబర్‌లోగా స్తానిక ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. అయితే మీనాక్షి పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం ఉపయోగ పడుతుందో చూడాలి.

# ఎపి లిక్కర్ కుంభకోణంలో కీలక మలుపు

### సిట్ దాడుల్లో హైదరాబాద్ శివారులో భారీగా డబ్బు పట్టివేత

### 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదు సీజ్




హైదరాబాద్,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో కీలక మలుపు చోటుచేసుకుంది. మద్యంకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కొత్త కోణాలు బయటపడుతున్నాయి. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజ్ కెసిరెడ్డి సూచన మేరకు 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలోని సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్‌లో అక్రమ మద్యం నగదు డంప్‌ను గుర్తించారు. లిక్కర్‌స్కామ్‌లో ఏ-40 వరుణ్ పురుషోత్తం నోట సంచలన నిజాలు వెల్లడయ్యాయి. అతని వాంగ్మూలం ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారులకు భారీగా నగదు పట్టు-బడింది. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ పాత్రపైనా సిట్ బృందం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదు ఉన్న 12 అట్ట పె-÷-టటె-లను ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు- సిట్ అధికారులు గుర్తించారు. నిన్న దుబాయ్ నుంచి వచ్చిన వరుణ్ పురుషోత్తమ్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ మద్యం స్కామ్‌లో రాజ్ కెసిరెడ్డి వసూళ్ల బృందంలో వరుణ్ కీలక వ్యక్తి. అతడి నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేసింది. వరుణ్ పురుషోత్తం నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టడంతో లిక్కర్ స్కామ్‌కి చెందిన భారీ నగదు నిల్వల విషయం వెలుగులోకి వచ్చింది. మరి కొన్ని చోట్ల సిట్ సోదాలు నిర్వహించే అవకాశముంది. వైకాపా ప్రభుత్వంలో ముఖ్య నేతల పాత్రపై కూడా సిట్‌కు కీలక సమాచారం లభ్యమైనట్టు- తెలుస్తోంది. పూర్తి ఆధారాలతో త్వరలో కొందరు పెద్దతలకాయల పాత్ర కూడా బయటపడే అవకాశముందని సమాచారం.హైదరాబాద్‌లో సిట్ అధికారులు సోదాలు చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్కాంలోవరుణ్ ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ఎ1గా ఉన్న కేశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వరుణ్, ఎ12 చాణక్య రూ. 11 కోట్లని 12 అట్టపెట్టల్లో దాచినట్లు- అంగీకరించారు. 2024 జూన్‌లో ఈ మొత్తం దాచినట్లుగా అధికారులు గుర్తించారు. శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామంలో ఉన్న సులోచన ఫార్మ్ హౌస్‌లో సిట్ అధికారులు తనిఖీలు చేసి భారీగా అక్రమ మద్యం డంపును స్వాధీనం చేసుకున్నారు. ఈ గెస్ట్‌హౌస్ సులోచన ఫార్మ్స్, ప్రొఫెసర్ తగల బాల్‌రెడ్డి, పేరు మీద ఉన్నట్లు- సిట్ అధికారులు గుర్తించారు. లిక్కర్ స్కాంలో సిట్ అధికారులు దూకుడు పెంచి హైదరాబాద్ నగరంలో భారీగా సోదాలు నిర్వహిస్తున్నారు. నగదు సీజ్ చేసి వరుణ్, చాణక్యలని అదుపులోకి తీసుకుని సిట్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

# భవిష్యత్ సోలార్ విద్యుత్‌దే !-



ఇంధన వనరులు తరగిపోవడం, జలవిద్యుత్ ప్రాజెక్టులు ఖరీదైనవిగా మారడంతో ఇప్పుడు సోలార్ విద్యుత్‌పై దృష్టి పడింది. కేంద్రం కూడా సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. అందుకు తగ్గట్లుగా వ్యక్తిగత ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీలు ఇస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సోలార్‌పై పరిశోధనలు పెరగాలి. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు సోలార్ పవర్ ఉత్పత్తిపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. అలాగే సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ తమ ప్రాధాన్యంగా చెబుతున్నారు. ఇది సాకారమైతే మంచి ఫలితాలు వస్తాయి. అలాగే సోలార్ ఎనర్జీ ఉత్పత్తితో పాటు నిల్వ చేసుకునే అవకాశాలపైనా పరిశోధనలు జరగాలి. కేంద్ర రాష్ట్రాలు కలసి ఈ దిశగా అడుగులు వేయాలి. సోలార్ విద్యుత్‌పై జాతీయ విధానాలకు ప్రయత్నాలు చేయాలి. తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా గ్రామాలకు వెలుగులు విరజిమ్మాలి. అయితే ఇది జాతీయ సమస్య. దీనిపై జాతీయ విధానం రావాలి. సంప్రదాయ విద్యుత్‌తో పోలిస్తే సోలార్ విద్యుత్ ఖరీదైనదిగా చెబుతున్నారు. కానీ అధ్యయనం, పరిశోధనలు చేస్తే దీనిని చౌకగా తాయరు చేసే విధంగా అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఈ క్రమంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చౌకగా ఉత్పత్తి చేసి దేశంలో మారుమూల గ్రామాల్లో సైతం వెలుగులు నింపేలా చేయవచ్చు. ఇది పాలకుల చిత్తశుద్ధి, సమర్థతపై ఆధారపడి ఉంటుంది. నిరంతర విద్యుత్ అందితేనే ప్రగతి వేగం పుంజుకుంటుంది. భవిష్యత్‌లో మరిన్ని పరిశ్రమలు రావడానికి ఆస్కారం ఉంటుంది. నిజానికి మనదేశంలో అనేక సహహజ వనరులు ఉన్నాయి. వాటిని ఉపయోగించాలి. నిరంతర విద్యుత్ సాధిస్తే దానికి అనుబంధంగా అనేక విధాలుగా దేశం పురోగమిస్తుంది. సోలార్‌తో నడిచే వాహనాలు కూడా రాగలవు. ఎలక్ట్రిక్ వాహనాలు మెల్లగా వస్తున్నాయి. దీని మార్కెట్ కూడా పెరుగుతోంది. దీంతో సోలార్ విద్యుత్ పెరిగితే అప్పుడు పెట్రో ఉత్పత్తులపైనా భారం తగ్గుతుంది. దేశంలోనే సోలార్ ఉత్పత్తుల కు మంచి ఆదరణ ఉంటుంది. నిజానికి రోడ్లు, మంచినీరు, విద్యుత్ అన్ని గ్రామాలకు ఇవ్వగలిగితే అంతకుమించిన అభివృద్ధి మరోటి ఉండదు. మనదేశంలో వనరులకు కొదవ లేదు. సోలార్ అందుబాటులోకి వస్తే ...కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యత పెరుగుతుంది. అలాగే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని కూడా చేపడుతున్న కంపెనీలు ముందుకు రాగలవు. పారిశ్రామిక సెజ్‌లలో ప్రత్యేక రాయితీలు కల్పించవచ్చు. దీంతో పెట్టుబడి దారులకు ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీలను ప్రోత్సహించాలి. ఆ దిశంగా మన ఐఐటిలు పరిశోధనలు జరపాలి. దీనిపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మేకిన్ ఇండియా అంటున్న ప్రధాని మన ఐఐటిల్లో సోలార్ విద్యుత్ పరిశోధనలకు పెద్దపీట వేయాలి. అంతే కాకుండా ఉన్న పరిశ్రమలను సోలార్‌తో నడిపించే అవకాశం ఉన్నవాటికి అదనంగా విస్తరించుకోవడానికి రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి. టెస్లా, మహింద్రా, టాటా సహా అనేక కంపెనీలు విద్యుత్ వాహనాలు విడుదల చేస్తున్నాయి. వీటికి ఛార్జింగ్ సమస్యలు ఉన్నాయి. విదేశాల్లో ముఖ్యంగా అమెరికా తదితర యూరోప్ దేశాల్లో ఉన్నట్లుగా దారిపొడవునా ఛార్జింగ్ స్టేషన్లు రావాలి. అప్పుడే విద్యుత్ వాహనాలకు గిరాకీ పెరుగుతుంది. తద్వారా కర్బన ఉద్గారాల విడుదల తగ్గతుంది. దేశంలో తొలి సారిగా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ ధృవీకరణ పొందిన ఉత్పాదనతో ఎలక్ట్రిక్ వాహనాల ను విడుదల చేసింది. గుమ్మడిదల మండలం అన్నారం పారిశ్రామికవాడ లోని సోలార్ ప్రీమియర్ మాడ్యుల్ పరిశ్రమ రాయితీలను సద్వినియోగం చేసుకోవడానికి అదనంగా మరో సోలార్ యూనిట్‌ను విస్తరించింది. పెట్టుబడులు పెట్టి ఉన్న పరిశ్రమను అదనంగా విస్తరించింది. దీంతో అదనంగా 200 మెగావాట్ల విద్యుత్ తయారుచేయనుంది. అంతే కాకుండా సోలార్‌తో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసి విడుదల చేశారు. అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. సోలార్ ఉత్పత్తి పెరిగితే పెట్రోల్, డీజిల్ వాహనాలకు స్వస్తి పలకనుంది. ఈ - వాహనాలు వస్తే వాయు కాలుష్యం తగ్గి పర్యావరణం ను రక్షించే విధంగా మారనుంది. సోలార్ పరిశ్రమలను స్థాపించే వారికి రాయితీలను విస్తరిస్తామని కూడా ప్రభుత్వాలు ప్రకటించాయి. సంగారెడ్డి పరిశ్రమ వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే ఐదేండ్ల కాలంలో ఈయూనిట్ సామర్థ్యాన్ని వెయ్యి మెగావాట్ల పెంచనున్నారు. దీంతో రాష్ట్రంలో నీటి విద్యుత్‌కు తోడుగా సోలార్ విద్యుత్ రానుంది. ఇందు కోసం రూ. 12 వందల కోట్ల పెట్టుబడితో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు కానుంది. పైలట్ ప్రాజెక్ట్‌గా పరిశ్రమలో సోలార్ వాహనాలు, అదనంగా సోలార్ విద్యుత్‌ను తయారు చేయనున్నారు. దీని వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

# పోలవరం నిర్వాసితుల పరిస్థితి దారుణం

### ఏటా హామీలే తప్ప ఆఉకునే ప్రయత్నం లేదు

### వరదలు ముంచెత్తినా పట్టింపు లేని పాలకులు

ఏలూరు,

ఉమ్మడి ఎపిలో పోలవరం మొదలయినా, రాష్ట్రం విడివడి 12 ఏళ్లు దాటినా పోలవం నేటికీ కలగానే మగిలింది. పాలకుల చిత్తశుద్ధి లోపం, అవినీతి, కాంట్రాక్ట్ సంస్థల మోసాల కారణంగా పోలవరం నిర్మాణ కాలం పెరుగుతూనే ఉంది. ఇప్పుడు 2027 నాటికి పూర్తి చేస్తామని ప్రస్తుతు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జగన్ ఐదేళ్ల కాలంలో దానితో ఆడుకున్నారు. ఇకపోతే దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టు అనేక పార్టీలకు ఎన్నికల హామీగా ఉంటోంది. గత ప్రభుత్వం కూడా 2019 నాటికే ప్రాజెక్టు పూర్తి చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పింది. కానీ దానికి తగ్గట్టుగా పనులు చేయలేకపోయింది. ఐదేళ్లు దాటిన వైసిపి ప్రభుత్వం కూడా హామీని నిలబెట్టుకోలేదు. 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లిస్తామని చెప్పినా నెరవేరలేదు. కానీ ఇప్పుడు దానిని మరో ఏడాదికి పొడిగించింది. ఓ దశలో ఎప్పటికిపూర్తవుతుందో అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పునరావాస ప్యాకేజీ పెద్ద సమస్యగా మారింది. వీరికి పరిహారం ఇస్తే ఖాళీ చేయడానికి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు సిద్ధంగా ఉన్నారు. ప్యాకేజీ ఇవ్వకుండా ఖాళీ చేయకూడదని ఎ.పి హైకోర్టు కూడా ఆదేశించింది. మొత్తంగా పోలవరం ప్రాజెక్టు వ్యవహారం పెద్ద ప్రహసనంగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపు కోవడానికి యత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దానిని నిలదీసి, నిధులు రాబట్టడంలో విఫలమవుతోంది. బాధితులు మాత్రం నిలువు నీళ్లలో, ఇప్పుడు వరదల సమయంలో చీకట్లో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సంగతి ఆ తర్వాత ప్రస్తుతం వరదల సమయంలో సహాయక చర్యలు చేపడదామనే ఆలోచన కూడా ప్రభుత్వాలకు రావడం లేదు. దీంతో కొద్దిపాటి వరదలకే ఊళ్లన్నీ జలమయమవుతున్నాయి. కాఫర్ డ్యామ్ మూసేశాక బ్యాక్ వాటర్ మూలంగా వంద గ్రామాలు జలదిగ్బంధంలో ఇరుక్కుంటున్నాయి. మాట తప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మూలంగా మన్యం వాసులు బాధితులుగా మిగిలారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు సహా అందరూ నానా ఇబ్బందులు పడుతున్నారు. సహజంగా జులై మధ్య నుంచి ఆగస్టు ఆఖరు వరకూ గోదావరికి ఉధృతంగా వరద తాకిడి ఉంటుంది. ఈసారి సీజన్ ప్రారంభంలోనే వరదల ప్రభావం కనిపిస్తోంది. ఇది రాబోయే నెల రోజుల పాటు మరింత తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది. అదే జరిగితే నిర్వాసితులు అనేక అవస్థలు పడాల్సి వస్తుంది. గతంలో గోదావరికి పెద్ద వరదలన్నీ ఆగస్టులోనే వచ్చాయి. కాబట్టి వచ్చే నెల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అత్యంత కష్టకాలం. ఇప్పటికే అవకాశం ఉన్నవారంతా ఒడ్డుకు చేరారు. కానీ గిరిజనలకు మాత్రం కాలనీలు సిద్ధం చేయక, ప్యాకేజీ అందక వరదల్లోనే గడపాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పుడు వరదల్లో వారికి రవాణా సదుపాయాలు కూడా లేవు. నిత్యావసర సరుకులు కూడా అందుబాటులో ఉంచలేదు. గత ఏడాది ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఏర్పడిన సమస్యలపై ముంపు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో అధికారులు తప్పిదాన్ని అంగీకరించారు. ఈసారి కూడా గత ఏడాది అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. ఉద్దేశ పూర్వకంగానే ఇలా వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాలు, కిరోసిన్ వంటివి అందుబాటులో ఉంచడం మీద శ్రద్ధ పెట్టడంలేదు. ఇప్పటికైనా యంత్రాంగం కదలాలి. నిర్వాసితులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలి. పడవలు ఏర్పాటు చేసి రవాణా సదుపాయం కల్పించాలి. వరద సహాయక చర్యలు సమగ్రంగా చేపట్టాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పునరావాస ప్యాకేజీ అమలుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దానికి భిన్నంగా సాగితే పోలవరం నిర్వాసితుల ఆగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి ఉంటుంది. చట్ట ప్రకారం జాతీయ హోదా ఉన్న ప్రాజెక్టుని నిర్మాణ వ్యయంపై పరిమితులు విధించడం మానుకోవాలి. గత కొన్నేళ్లుగా వరద బాధలను, నిర్వాసితులను ఆదుకోవాల్సిన అవసరం గురించి మొత్తుకుంటున్నా పాలకులు మిన్నకున్నారు. చట్టాన్ని ప్రభుత్వమే యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రజల అవసరాల కోసం సర్వం వదిలిపోతున్న వారి జీవితాలతో ఆడుకుంటున్నట్టు కనిపిస్తోంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# బడుగుల బిడ్డలను బతుకనీయరా?

**'మా బిడ్డలు కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలి. మా బిడ్డలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదిగి ఉన్నత స్థాయికి రావాలి' అని బడుగుల తల్లిదండ్రులు గంపెడాశతో తమ బిడ్డలను గురుకుల స్కూళ్లకు పంపుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్వరాష్ట్రం సాధించుకున్నాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో 1,023 గురుకులాలను నెలకొల్పారు. అవి దేశంలోని నవోదయ పాఠశాలల కంటే ఎక్కువ సంఖ్యలో ఉండటం మరో విషయం.అది 2016%% అటు సైకిల్ షాప్‌లో పంచర్లు వేసుకుంటూ, ఇటు గురుకులంలో చదివే పిల్లవాడి దగ్గరికి వెళ్లి 'నువ్వేం అవుదామనుకుంటున్నావు' అని అడిగితే.. 'నేను ఈ సూర్యాపేట కలెక్టర్ సురేంద్రమోహన్‌లా ఐఏఎస్ అవుతా'నని ఆ బడుగు బిడ్డ సమాధానం చెప్తే ఆనందపరవశం చెందాం. ఆ పిల్లాడే కాదు, చాలామంది బడుగుల విద్యార్థులు గురుకులాల్లో చదువుకొనే ఉన్నత చదువులకు వెళ్లారు. ఎవరెస్టు శిఖరాన్ని సైతం అవలీలగా అధిరోహించారు. నయా పైసా ఖర్చు లేకుండా తమ బిడ్డలు కార్పొరేట్ విద్యాలయాల్లో చదువుకుంటున్నారని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పూలే ఆలోచనాదారిలో దార్శనిక దృష్టితో రాష్ట్రంలో వలె పెద్ద సంఖ్యలో గురుకులాల ఏర్పాటు దేశంలో ఎక్కడా జరగలేదు. పీవీ నెలకొల్పిన గురుకులాలలో చదివిన పిల్లలే ఇప్పటి బుర్రా వెంకటేశం, సీఎస్ రామకృష్ణారావు. రాష్ట్రంలో ఇప్పుడున్న సగానికి పైగా గ్రూప్-1 ఆఫీసర్లు గురుకులాల నుంచి ఎదిగివచ్చినవారే..**

వీరిని చూస్తే కేసీఆర్ నెలకొల్పిన 1,023 గురుకులాల నుంచి ఎంతమంది విద్యార్థులు సివిల్ సర్వెంట్లుగా వచ్చి తీరుతారోనని తెలంగాణ బడుగు సమాజం పరవశం చెందింది. గురుకులాలను సమర్థవంతంగా నిర్వహించి వాటి ప్రతిష్టను ఆర్ఎస్ ప్రవీణ్ పెంచారు. ఇక్కడి నుంచే ఉన్నత విద్యకు బలమైన బాటలుపడ్డాయి. గురుకులాలను చిదిమేసే పని నేటి పాలకులు చేస్తుంటే గుండె తల్లడిల్లుతున్నది. కళ్లల్ల నీళ్లు నిండుతున్నాయి. పదవులు వస్తయి, పోతయి. కానీ, గురుకులాలపైన విషంగక్కే ఎవ్వరినీ బడుగులు క్షమించరు. అవును, తెలంగాణ సాయుధ పోరాటంలో తిరుగబడ్డ వీరులు దొర గడీలను కూల్చారు. 'బాంచన్ దొర అనే బతుకులు మాకు వద్ద'ని 4 వేల మంది బడుగులు నేలకొరిగారు. నాటి నుంచి నేటి సాయుధ పోరాటాల్లో పాల్గొని నేలకొరిగిన వీరులంతా బడుగుబిడ్డల బంగారు భవిత కోసమేనన్నది సత్యం. అలాంటి బడుగు బిడ్డలకు గురుకులాల రూపంలో కార్పొరేట్ విద్య అందివస్తే బడుగులు మురిసిపోయారు. కానీ, నేడు విష ఆహారం పెట్టి బిడ్డల భవిష్యత్తును చిదుముతుంటే బడుగు తల్లిదండ్రుల గుండెలు మండుతున్నాయి? పిల్లలకు కలుషిత నీళ్లు, కలుషిత అన్నం పెట్టిన పాలకులను ఏమని నిలదీయాలి? తమ బతుకులు మార్చుతారనుకున్న కన్న బిడ్డలు శవాలై వాన చినుకుల్లా రాలిపోతుంటే బడుగుల తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోతున్నారు. తెలంగాణ రాకముందు బీసీ పిల్లల ఉద్యమమంతా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలపైనే జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాకారం తర్వాత గురుకులాలు రావటంతో బడుగుల బిడ్డలు ఊపిరి పీల్చుకున్నారు. గురుకులాలతో నాణ్యమైన విద్య లభిస్తుంది. కానీ, గత ఏడాదిన్నరగా గురుకులాల్లో విద్యార్థుల మరణమృదంగాలు తెలంగాణను తల్లడిల్లేలా చేశాయి. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మళ్లీ పురుగులన్నం, నాసిరకం భోజనంతో ఫుడ్ పాయిజన్‌కు దారితీసే పరిస్థితులు వస్తాయన్న ఊహ కూడా లేదు. 20 నెలల్లో సుమారు 100 మంది చనిపోవటం కంటే మిం చిన విషాదం ఏముంటుంది? గురుకులాల్లో బిడ్డలకు మంచి భోజనం పెట్టండి, బిడ్డలు ఆత్మహత్యలకు పాల్పడకుండా చూడాలని బడుగుల తల్లిదండ్రులు మొరపెట్టుకునే దశ మళ్లీ రావటం దారుణం. అందుకే, గురుకులాల రక్షణ కోసం రాజకీయా లకతీతంగా బడుగులంతా ఏకం కావాలి. గురుకులాల్లోని బడుగుబిడ్డల రక్షణ కోసం పాలకులను నిలదీయాలి. 'మా బిడ్డల్ని చంపే అధికారం మీకెవరిచ్చార'ని కోట్లాది గొంతుకలు ప్రశ్నించాలి. బడుగుల బిడ్డల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైన పని ఈ ప్రభుత్వానికి ఏముంటుంది? కలుషిత ఆహారం పెట్టి వాళ్ల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్న స్థితికి కారకులకు ఏ శిక్షలు వేయాలో న్యాయస్థానాలే నిర్ణయించాలి. ఇంత దుర్మార్గాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు సుమోటో కేసులుగా తీసుకొని నోరులేని బడుగుల బిడ్డల ప్రాణాలు కాపాడాలి. బడుగుల బిడ్డల చావులు చూస్తూ తెలంగాణ సృజనలోకం ఊరుకోదు. కింది కులాల బిడ్డల కోసం ఏర్పాటు చేసిన గురుకులాల్లో బిడ్డలకు నాసిరకమైన తిండి, కలుషిత ఆహారంతో విషం పెడుతుంటే సృజనకారులు చూస్తూ ఊరుకోరు. వెనుకబడిన కులాలు వెంటాడే కలాలవుతాయి. తెలంగాణ కవులు పదునెక్కిన కలాలై ప్రభావిస్తారు. 'పల్లెటూరి పిల్లగాడా, పసులగాసే మొనగాడా' అని పాట కట్టిన సుద్దాల హన్మంతుకు జవాబుదారీగా వెలిసిన గురుకులాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.




# టీమిండియా గొప్ప పోరాట పటిమ ప్రదర్శించింది

## 2-2తో సిరీస్ ను సమం చేస్తాం

### ధీమా వ్యక్తం చేసిన కోచ్ గౌతం గంభీర్

ఇంగ్లాండ్ తో ఈనెల 31 నుంచి లండన్ లోని ద ఓవల్ మైదానంలో జరిగే ఐదో టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ లెవన్ గురించి చర్చ నడుస్తోంది. ముఖ్యంగా జట్టులో స్టార్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా ఆడతాడా..? లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. నిజానికి ఈ టెస్టు ప్రారంభానికి ముందే బుమ్రా కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడతాడాని టీమ్ మేనేజ్మెంట్ ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే తొలి టెస్టులో ఆడిన బుమ్రా.. రెండో టెస్టులో పెవలియన్ కు పరిమితమయ్యాడు. మూడు, నాలుగు టెస్టులో తను ఆడాడు. దీంతో తనకు కేటాయించిన మూడు టెస్టులు ముగిశాయి. అయితే జట్టు ప్రాధాన్యత రిత్యా ఐదో టెస్టులో తను ఆడతాడా... లేదా అన్న దానిపై జట్టు హెడ్ కోచ్ గౌతం గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జట్టులో పేసర్లంతా ఫిట్ గా ఉన్నారని, అయితే బుమ్రా ఆడటంపై మాత్రం నిర్ణయం తీసుకోలేదని



చెప్పాడు. సిరీస్ లో మూడు టెస్టులే ఆడినప్పటికీ, బుమ్రా మాత్రం అదరగొట్టాడు. టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. ఇప్పటివరకు 14 వికెట్లను కేవలం 26 సగటుతో మాత్రమే తీశాడు. ఇందులో రెండుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన ఉండటం విశేషం. ప్రత్యర్థి జట్టు కూడా బుమ్రా బౌలింగ్ ను ఆచితూచి ఆడుతుండగా, మిగతా వారిపైన మాత్ర విరుచుకుపడుతుంది. ఐదో టెస్టుకు సంబంధించి గంభీర్ మాట్లాడుతూ.. తమ జట్లు అనుభవ రహితంగా ఉందని, అయినప్పటికీ గొప్ప పోరాట పటిమ ప్రదర్శించిందని కొనియాడాడు. ఇదే స్ఫూర్తితో ఐదో టెస్టును గెలిచి, 2-2తో సిరీస్ ను సమం చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు.గంభీర్ మాటలను బట్టి, ప్లేయింగ్ లెవన్ లో మార్పులు తప్పేలా కనిపించేటట్లు లేదు. బుమ్రా, మహ్మద్ సిరాజ్ తమంతట తాము తప్పుకుంటే తప్పా, వారు ప్లేయింగ్ లెవన్ లో ఆడతారు. ఒకవేళ ఈ ఇద్దరిలో ఎవరు ఆడకపోయినా, అర్షదీప్ సింగ్ ను ఆడించే అవకాశముంది. మూడో పేసర్ గా



విఫలమైన అన్షుల్ కాంబోజ్ ను తప్పించి, అతని స్థానంలో ఆకాశ్ దీప్ ను ఆడించవచ్చు. బ్యాటింగ్ లైనప్ లో ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఆడతారు. మూడోస్తానంలో సాయి సుదర్శన్ కు మరో ఛాన్స్ దక్కుతుంది. నెం.4లో కెప్టెన్ శుభమాన్ గిల్ ఆడతాడు. గాయంతో రిషభ్ పంత్ దూరం కావడంతో అతని స్తానంలో ధ్రువ్ జురెల్ ఆడటం ఖాయంగా మారింది. అయితే తను ఏడో నెంబర్లో బ్యాటింగ్ చేసే అవకాశముంది. దీంతో ఐదు, ఆరు స్తానాల్లో వరుసగా వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజాలను ఆడించే చాన్స్ ఉంది. ఒకవేళ వికెట్ స్పిన్ కు అనుకూలిస్తే శార్దూల్ ఠాకూర్ స్తానంలో కుల్దీప్ యాదవ్ ను ఆడించొచ్చు. ఏదేమైనా పిచ్ పరిస్థితి, ఆటగాళ్ల లభ్యతను బట్టి టీమిండియా మేనేజ్ మెంట్ ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.



# పిచ్ క్యూరేటర్‌తో కోచ్ గంభీర్ వాగ్వాదం



టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్, లండన్‌లోని ఓవల్ స్టేడియం పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 'కేవలం ఇక్కడ నువ్వు ఓ మైదాన సిబ్బంది మాత్రమే. టీమ్ఇండియాకు నువ్వేం చెప్పాల్సిన అవసరం లేదు. ఏం చేయాలో మాకు తెలుసు. కావాలంటే మీ అధికారులకు ఫిర్యాదు చేస్కో' అంటూ గంభీర్ అతడిని తీవ్రంగా హెచ్చరించినట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే, వారిద్దరి మధ్య వాగ్వాదానికి గల కారణం మాత్రం స్పష్టంగా తెలియలేదు. తెందూల్కర్ - అండర్సన్ ట్రోఫీలో భాగంగా టీమ్ఇండియా, ఇంగ్లాండ్‌ల మధ్య జులై 31 నుంచి చివరిదైన ఐదో టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ క్రమంలోనే ట్రెయినింగ్ సెషన్‌లో భాగంగా జట్టు ఆటగాళ్లతో గంభీర్ నెట్స్‌లో సాధన చేయిస్తున్నాడు. ఇంతలో క్యూరేటర్? లీ ఫోర్టిస్ అక్కడికి చేరుకొని ఏదో విషయం చెప్పాడు. ఇదే వారిద్దరి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. మాటామాటా పెరగడంతో భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కలగజేసుకొని క్యూరేటర్ లీ ఫోర్టిస్?ను కాస్త దూరంగా తీసుకుకొని వెళ్లిపోయినా, వారిద్దరి మధ్య వాగ్వాదం కాసేపు కొనసాగింది. కాగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్? మీడియాలో వైరల్‌గా మారింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉండగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో చివరి టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను డ్రాగా ముగించాలని భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.అంతకుముందు లండన్?లోని భారత హైకమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో టీమ్?ఇండియా కోచ్ గంభీర్, క్రికెటర్లు, ప్రవాస భారతీయులు, భారత సంతతికి చెందిన బ్రిటన్ ఎంపీలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు. ఈ క్రమంలో మాట్లాడిన గంభీర్ ఇప్పటికే టెస్టు సిరీస్?లో ఆధిక్యంలో ఉన్న ఇంగ్లాండ్?పై ఆఖరి మ్యాచ్?లో గెలిచి సిరీస్?ను సమం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు"భారత్- ఇంగ్లాండ్ మధ్య చరిత్ర ఉంది. అందుకే ఇంగ్లాండ్?లో భారత్ జట్టు పర్యటించినప్పుడు ఎల్లప్పుడూ సవాల్?గా ఉంటుంది. మేము యూకే పర్యటించినప్పుడల్లా మంచి మద్దతు లభిస్తుంది. ఈ గౌరవాన్ని ఎప్పటికీ మర్చిపోం. ఈ పర్యటనలోని ప్రతి అంశాన్ని గుర్తుంచుకుంటాం. దేనినీ తేలికగా తీసుకోం. గత ఐదు వారాలు రెండు దేశాలకు ఉత్తేజమైన క్షణాలు. ఈ సిరీస్?లోని క్రికెట్ క్వాలిటీ ప్రతి క్రికెట్ ప్రేమికుడిని గర్వపడేలా చేసిందని నేను కచ్చితంగా నమ్ముతున్నాను" అని గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు.కాగా, భారత్‌తో నాలుగో టెస్టులో చివరి రోజు మాండేటరీ ఓవర్లు ఆరంభం కావడానికి ముందు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ డ్రా కోసం ప్రతిపాదించినా భారత బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అంగీకరించలేదు. దీంతో ఇంగ్లిష్ ఆటగాళ్లు భారత బ్యాటర్లతో అమర్యాదకరంగా వ్యవహరించడం పెద్ద చర్చకే దారి తీసింది.

# ఇంగ్లాండ్ పర్యటన సవాలేగానే భావిస్తాం

### టీమ్?ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్

ఇంగ్లాండ్ పర్యటన భారత్?కు ఎల్లప్పుడూ సవాలుతో కూడుకుని ఉంటుందని టీమ్?ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. అయితే ప్రస్తుతం జరుగుతున్న టెస్టు సిరీస్?లో క్వాలిటీ ప్రతి క్రికెట్ ప్రేమికుడిని గర్వపడేలా చేసిందని కొనియాడాడు. తాము ఇంగ్లాండ్?లో పర్యటించినప్పుడల్లా విశేషమైన మద్దతు లభిస్తోందని తెలిపాడు. మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసిన సందర్భంగా భారత హైకమిషన్ లండన్?లోని ఇండియా హౌస్?లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గంభీర్ వ్యాఖ్యలు చేశాడు."భారత్- ఇంగ్లాండ్ మధ్య చరిత్ర ఉంది. అందుకే ఇంగ్లాండ్?లో భారత్ జట్టు పర్యటించినప్పుడు ఎల్లప్పుడూ సవాల్?గా ఉంటుంది. మేము యూకే పర్యటించినప్పుడల్లా మంచి మద్దతు లభిస్తుంది. ఈ గౌరవాన్ని ఎప్పటికీ మర్చిపోం. ఈ పర్యటనలోని ప్రతి అంశాన్ని గుర్తుంచుకుంటాం. దేనినీ తేలికగా తీసుకోం. గత ఐదు వారాలు రెండు దేశాలకు ఉత్తేజమైన క్షణాలు. ఈ సిరీస్?లోని క్రికెట్ క్వాలిటీ ప్రతి క్రికెట్ ప్రేమికుడిని గర్వపడేలా చేసిందని నేను కచ్చితంగా నమ్ముతున్నాను" అని గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు.లండన్?లోని భారత హైకమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో టీమ్?ఇండియా కోచ్ గంభీర్, క్రికెటర్లు, ప్రవాస భారతీయులు, భారత సంతతికి చెందిన బ్రిటన్ ఎంపీలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు. ఈ క్రమంలో గంభీర్ ప్రసంగించాడు. ఇప్పటికే టెస్టు సిరీస్?లో ఆధిక్యంలో ఉన్న ఇంగ్లాండ్?పై ఆఖరి మ్యాచ్?లో గెలిచి సిరీస్?ను సమం చేయాలని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్?తో టెస్టు సిరీస్?లో టీమ్ ఇండియా చూపించిన పోరాట స్ఫూర్తి అద్భుతమని యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తెలిపారు. భారత ఆటగాళ్ల స్ఫూర్తి దేశంలోని అసమానతలను ఎదుర్కోవాలనే సంకల్పానికి సరైన ప్రతిబింబంగా అభివర్ణించారు. "ఇది గొప్ప సిరీస్. మంచి స్ఫూర్తితో ఆడారు. కానీ అన్నింటికంటే ఉత్తమమైన విషయం ఏమిటంటే అసలైన టెస్ట్ క్రికెట్?ను ఈ సిరీస్?లో చూశాం. ఐదు రోజుల పాటు మ్యాచ్?లు చూశాం. టీమ్ ఇండియా ఈ సిరీస్?లో నైపుణ్యాన్ని ప్రదర్శించింది. చివరి టెస్ట్?లో ఏమి జరిగినా ఫర్వాలేదు. టీమ్?ఇండియాను చూసి గర్వపడుతున్నాం." అని దొరైస్వామి పేర్కొన్నారు.ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్ గౌల్డ్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఇటీవలే భారత్- యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావించారు. ఇండియా- యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం క్రీడలతో సహా రెండు దేశాల మధ్య సహకారానికి అపారమైన పరిధికి సంకేతంగా పేర్కొన్నారు. భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?లో ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్?లు ఫలితం కోసం ఐదో రోజు వరకు వెళ్లాయన్నారు. గురువారం (జులై 31) నుంచి ఓవల్ లో యుద్ధం తిరిగి ప్రారంభమవడాన్ని చూడటానికి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు.అలాగే ఈ సమావేశం తర్వాత ప్రముఖ కామెంటేటర్, టీమ్ ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కెప్టెన్ శుభ్ మన్ గిల్?తో సహా కొంతమంది ఆటగాళ్లతో మాట్లాడారు. మరోవైపు, భారత కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "సిరీస్ ప్రారంభానికి ముందు నేను నిజంగా నా అత్యుత్తమ ప్రదర్శనను ఇవ్వలేదనిపించింది. నన్ను నేను నిరూపించుకోవాలనుకున్నాను. సిరీస్?కు ముందు నా ఆటపై దృష్టి పెట్టాను. నాలుగో రోజు మేమున్న స్థితి నుంచి మ్యాచ్?ను డ్రా చేసుకోవడం అసాధారణ విషయం." అని గిల్ అభిప్రాయపడ్డాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



# టెస్ట్ క్రికెట్‌లో రికార్డుల వర్షం కురిపిస్తున్న జడేజా

రవీంద్ర జడేజా మోకాలికి 2022 ఆగస్టులో గాయం అయింది. కానీ, ఇప్పుడు ఆయన పూర్తిగా కోలుకుని, టీమిండియాలోకి తిరిగి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు అవుతోంది. తిరిగి వచ్చినప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో జడేజా ప్రదర్శన గురించి మాత్రమే అందరూ మాట్లాడుకుంటున్నారు. పరుగులు, వికెట్లు, హాఫ్ సెంచరీలు.. ఇలా ఎన్నో రికార్డుల్లో ఆయన పేరు ముందున్నాయి. గాయం నుంచి కోలుకున్నాక జడేజా పెద్ద పెద్ద ఆటగాళ్లపైనే పైచేయి సాధించడం విశేషం.





2022 ఆగస్టులో గాయపడిన జడేజా, 5 నెలలు ఆటకు దూరమయ్యాడు. 2023 ఫిబ్రవరిలో బోర్డర్–గవాస్కర్ ట్రోఫీతో మళ్ళీ టీమిండియాలోకి వచ్చాడు. గాయం తర్వాత ఎంత బాగా ఆడతాడో, దానికి ట్రైలర్‌గా రంజీ ట్రోఫీలో ఒక మ్యాచ్ ఆడాడు. తమిళనాడుతో జరిగిన ఆ మ్యాచ్‌లో 8 వికెట్లు తీశాడు. అందులో 7 వికెట్లు ఒకే ఇన్నింగ్స్‌లో వచ్చాయి.ఆ ట్రై మ్యాచ్‌లో బాగా ఆడిన జడేజా, టీమిండియా తరపున టెస్ట్ క్రికెట్‌లో బరిలోకి దిగినప్పుడు కూడా తన పవర్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించాడు. గాయం నుంచి తిరిగి వచ్చి రెండేళ్లకు పైగా అవుతోంది. ఈ సమయంలో ఎప్పుడూ తన ప్రదర్శనలో తగ్గలేదు. గాయం తర్వాత అతని ఆటలో స్థిరత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ స్థిరమైన ప్రదర్శన వల్ల రవీంద్ర జడేజాకు చాలా లాభం చేకూరింది. గాయం నుంచి తిరిగి వచ్చాక టెస్ట్ క్రికెట్‌లో ఆయన మూడో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్, రెండో అత్యంత విజయవంతమైన బౌలర్. అత్యధిక అర్ధ సెంచరీలు సాధించడంలో రెండో స్థానంలో ఉన్నాడు. ఒక మ్యాచ్‌లో 10 వికెట్లు తీసిన వారిలో నెంబర్ వన్గా ఉన్నాడు. అంతేకాదు, జడేజా ఇప్పుడు టెస్ట్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో కూడా నెంబర్ 1గా నిలిచాడు.2022 ఆగస్టులో గాయం నుంచి కోలుకున్న తర్వాత రవీంద్ర జడేజా టెస్ట్ క్రికెట్‌లో 24 మ్యాచ్‌లు ఆడాడు. వాటిలో 1301 పరుగులు చేయడంతో పాటు 88 వికెట్లు తీశాడు. ఈ సమయంలో ఆయన 11 సార్లు అర్ధ సెంచరీకి పైగా స్కోర్లు సాధించాడు (2 సెంచరీలు కూడా ఉన్నాయి). అలాగే, 2 సార్లు ఒకే టెస్ట్ మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి అద్భుతం చేశాడు. గాయం నుంచి తిరిగి వచ్చిన తర్వాత, రవీంద్ర జడేజాను టెస్ట్ క్రికెట్‌లో ఆపడం కష్టంగా మారింది. అతని బ్యాటింగ్ సగటు విరాట్ కోహ్లీ, ట్రావిస్ హెడ్, బాబర్ అజామ్, మార్నస్ లబుషేన్, కేఎల్ రాహుల్, బెన్ స్టోక్స్ వంటి గొప్ప ఆటగాళ్ల కంటే మెరుగ్గా ఉంది. అలాగే, అతని బౌలింగ్ సగటు కూడా మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, మార్క్ వుడ్, క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ వంటి బౌలర్ల కంటే తక్కువగా ఉంది.




# మహేష్ తాంబే సరికొత్త వరల్డ్ రికార్డు..




క్రికెట్ అభిమానులంతా ఆశ్చర్యపోయే విధంగా ఫిన్‌లాండ్ క్రికెట్ జట్టుకు చెందిన బౌలర్ మహేష్ తాంబే అద్భుతమైన రికార్డును నెలకొల్పాడు. ఎస్టోనియా క్రికెట్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 8 బంతుల్లో 5 వికెట్లు తీసి చరిత్ర సృష్టించాడు. దీంతో టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 5 వికెట్లు తీసిన బౌలర్‌గా మహేష్ తాంబే ప్రపంచ రికార్డును తన పేరున లిఖించుకున్నాడు. ఈ ఘనత సాధించడానికి ఆయన కేవలం 2 ఓవర్లలో 19 పరుగులు మాత్రమే ఇచ్చాడు. గతంలో ఈ రికార్డు బహ్రెయిన్‌కు చెందిన జునైద్ అజీజ్ పేరిట ఉండేది. ఆయన 2022లో జర్మనీపై 10 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టారు. కానీ, మహేష్ తాంబే అంతకంటే తక్కువ బంతుల్లోనే ఈ రికార్డు పూర్తి చేశాడు.ఆదివారం జరిగిన ఫిన్‌లాండ్ వర్సెస్ ఎస్టోనియా మూడో టీ20 మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎస్టోనియా 19.4 ఓవర్లలో 141 పరుగులు చేసింది. ఒకానొక దశలో ఎస్టోనియా 14.3 ఓవర్లలో 104 పరుగులు చేసి, 8 వికెట్లు చేతిలో ఉండటంతో మంచి స్థితిలో ఉంది. కానీ మసూద్ మూడో వికెట్‌గా వెనుదిరిగిన తర్వాత వికెట్లు వరుసగా పడిపోయాయి. మహేష్ తాంబేతో పాటు జునైద్ ఖాన్ 2 వికెట్లు తీయగా, అమ్జాద్ షేర్, అఖిల్ అర్జునం, మాధవ ఒక్కో వికెట్ పడగొట్టారు.తాంబే కేవలం 8 బంతుల్లోనే 5 వికెట్ల ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. అతను 5 వికెట్లు పడగొట్టిన బ్యాట్స్‌మెన్‌లు %–% స్టెఫెన్ గోచ్, సాహిల్ చౌహాన్, ముహమ్మద్ ఉస్మాన్, రూపమ్ బారువా, ప్రణయ్ గీవాలా.



ఫిన్‌లాండ్ జట్టు 142 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో 5 వికెట్ల తేడాతో ఛేదించి విజయం సాధించింది. అరవింద్ మోహన్ 60 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో అజేయంగా 67 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇది నిర్ణయాత్మక మ్యాచ్. ఈ విజయం ఫిన్‌లాండ్‌కు 2–1 తేడాతో సిరీస్‌ను అందించింది.39 ఏళ్ల మహేష్ తాంబే 2021లో ఫిన్‌లాండ్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు అతను 28 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మొత్తం 28 వికెట్లు పడగొట్టాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తాంబే తన టీ20 కెరీర్‌లో మొదటిసారిగా 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. అది కూడా ప్రపంచ రికార్డు సృష్టిస్తూ కావడం విశేషం. ఈ అద్భుత ప్రదర్శనతో మహేష్ తాంబే క్రికెట్ ప్రపంచంలో ఒక ప్రత్యేక గుర్తింపు పొందాడు.

# ఇంగ్లాండ్ గడ్డపై సెంచరీల వర్షం

## సిరీస్‌లో ఏకంగా 18 సెంచరీలు

భారత్–ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో ఇప్పటివరకు బ్యాట్స్‌మెన్‌ల హవానే కొనసాగింది. రెండు జట్ల బ్యాట్స్‌మెన్‌లు కలిసి టెస్ట్ క్రికెట్ చరిత్రలో మునుపెన్నడూ జరగని రీతిలో రికార్డులు సృష్టించారు. ముఖ్యంగా భారత యువ సంచలనం శుభమన్ గిల్ ఒకే టెస్ట్‌లో 400 కంటే ఎక్కువ పరుగులు చేసి చరిత్ర సృష్టిస్తే, ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఒక టెస్ట్‌లో 5 వికెట్లు తీయడంతో పాటు సెంచరీ సాధించి తన పేరును రికార్డు పుస్తకాల్లో లిఖించుకున్నాడు. సాధారణంగా ఇంగ్లాండ్ పిచ్‌లు పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉంటాయని, మేఘావృతమైన వాతావరణంలో స్వింగ్, సీమ్ కూడా ఎక్కువగా ఉంటుందని చెబుతారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడిన నాలుగు టెస్టుల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ, మేఘాలు ఉన్నప్పటికీ, ఈ కఠిన పరిస్థితుల్లో కూడా బ్యాట్స్‌మెన్‌లే అదరగొట్టారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఏకంగా 18 సెంచరీలు నమోదయ్యాయి.మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్‌లో మొత్తం 5 సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో 3 సెంచరీలు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో శుభమన్ గిల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా బ్యాట్ నుంచి వచ్చాయి. ఈ మూడు సెంచరీల పుణ్యమా అని నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవాల్సి వచ్చింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు మొత్తం 18 సెంచరీలు నమోదయ్యాయి.




వాటిలో అత్యధిక సెంచరీలు భారత బ్యాట్స్‌మెన్‌లు సాధించారు. మొత్తం 18 సెంచరీలలో, 11 సెంచరీలు భారత బ్యాట్స్‌మెన్‌లు సాధించగా, 7 సెంచరీలు మాత్రమే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లు చేశారు. శుభమన్ గిల్ ఈ సిరీస్‌లో ఏకంగా 4 సెంచరీలు కొట్టి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.ఇక ఇంగ్లాండ్ తరఫున జో రూట్ 2 సెంచరీలు చేయగా, బెన్ స్టోక్స్, బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, జేమ్స్, ఓలీ పోప్ తలో సెంచరీ సాధించారు. సెంచరీల విషయంలో టీమిండియా ఇంగ్లాండ్‌ను అధిగమించింది. ఈ సిరీస్‌లో చివరి టెస్ట్ ఇంకా మిగిలి ఉంది. ఇది జులై 31 నుంచి ది ఓవల్ స్టేడియంలో జరగనుంది. ఇంగ్లాండ్‌తో జరిగే ఐదో టెస్ట్‌లో శుభమన్ గిల్ రెండు




ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 11 పరుగులు చేస్తే చాలు. ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా అతను రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు సునీల్ గవాస్కర్ పేరుతో ఉంది. గవాస్కర్ 1978–79లో ఒక సిరీస్‌లో 732 పరుగులు సాధించారు. గిల్ ఇప్పటివరకు ఆడిన 4 టెస్టుల్లో మొత్తం 722 పరుగులు చేశాడు. చివరి టెస్ట్‌లో ఈ 11 పరుగులు సాధించి గవాస్కర్ రికార్డును బద్దలు కొడతాడా లేదా అనేది ఆసక్తిగా మారింది.



# వంతారా ఎంతో వింతేరా! ..

## వింతైన ఆ జంతు ప్రపంచం చూసొద్దాం రండి!


చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు.అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్





అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'!అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.

అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా%ొ% మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ొ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా%ొ% నేను దాన్ని బాగా చూసుకుంటాను%ొ%' అని చెప్పాడా పిల్లవాడు.అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి.మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది'%ొ% అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ%ొ% స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్%ొ% అడవి చుక్క అని అర్థం!వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలుభారత్ సహా ప్రపంచంలోని విభిన్నప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి.అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్%ొ%లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది.క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ.వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి.ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి.కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (%×ఖజచీ%), వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా.వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్. ఆపద నుంచి గట్టెక్కిన ఎన్నో మూగజీవాలకు ఈ నీడ నిజంగా దేవుడి తోడే కదూ!










అక్షరకలం
తెలుగు దినపత్రిక



# మహావతార్ నరసింహా అద్భుతం

## చిత్ర బృందాన్ని మెచ్చుకున్న ప్రభాస్




ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శుభాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉన్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్ట్‌కు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.






# కింగ్డమ్ నుంచి రగిలే రగిలే లిరికల్ సాంగ్ విడుదల

విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా..పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు-చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీ-జర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు. కింగ్డమ్' కథ అనుకోగానే దీన్ని తమిళంలో కూడా కచ్చితంగా విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు.








# వార్నర్‌కు బాహుబలి కిరీటం

దేవిడ్ వార్నర్.. క్రికెట్ అభిమానులకే కాదు.. సినీప్రియులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. తెలుగు సినిమా పాటలకు తనదైన ÷-టసైల్‌లో డ్యాన్స్ వేస్తూ అలరిస్తుంటారు. 'బాహుబలి' సినిమాపై ఆయన చేసిన వీడియోలు కూడా అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడీ క్రికెటర్‌కు మన దర్శకధీరుడు రాజమౌళి 'బాహుబలి' కీరిటాన్ని పంపనున్నారు. ఇండియన్ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది 'బాహుబలి'. ఈ చిత్రం విడుదలై 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దీన్ని మరోసారి ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ గతంలో తాను ధరించిన బాహుబలి కాస్ట్యూమ్ లుక్స్‌ను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'కిరీటం ఉన్న ఫొటో బాగుందా? లేని పిక్ నచ్చిందా?' అని క్యాప్షన్ పెట్టారు. దీనికి రాజమౌళి రిప్లై ఇచ్చారు. హాయ్ డేవిడ్.. మీరిప్పుడు మాహిష్మతి సామ్రాజ్యానికి నిజమైన రాజులా తయారవ్వండి. నేను ఈ కిరీటాన్ని పంపుతున్నానని అన్నారు. దానికోసం ఎదురుచూస్తుంటానని క్రికెటర్ చెప్పారు. 'మీరు ఆస్ట్రేలియాలో ఈ సినిమాను మరోసారి చూడండి' అని టీమ్ మరో కామెంట్ పెట్టింది. దీనికి వార్నర్ ఓకే అంటూ థంబ్ పెట్టారు. రెండు భాగాలుగా అలరించిన ఈ బ్లాక్‌బస్టర్ ఇప్పుడు ఒకే పార్ట్‌గా రానుంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానున్న విషయం తెలిసిందే.

# ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి

పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని -క్లైమాక్స్ పూర్తయినట్లు- తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు.




# చందమామల కథ స్ఫూర్తితో విశ్వంభర

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'కి సంబంధించిన ఆసక్తికర విషయాల కోసం చిరు అభిమానులతో పాటు- సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంగతులు పంచుకున్నారు. దీని టీజర్ విడుదలయ్యాక 'అవతార్'కు కాపీ అంటూ వచ్చిన ట్రోల్స్‌పై మాట్లాడారు. టీజర్ నాకు నచ్చింది కాబట్టి నేను రిలీజ్ చేశాను. అందులో కనిపించిన పాప కాస్ట్యూమ్‌ను చూసి అందరూ నేను అవతార్ సినిమా కాపీ చేసి దాన్ని రూపొందించానని అన్నారు. టీజర్‌లో కనిపించిన కొండలు,ఆ పాప చెవులు చూసి అలా భావించారు.





# సతీలీలావతిగా లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ-జర్‌ను టీ-మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.



# 95 ఏళ్ల రికార్డు పై కన్నేసిన శుభమన్ గిల్

భారత్–ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో భారత యువ సంచలనం శుభమన్ గిల్ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 4 టెస్టుల్లో 8 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 722 పరుగులు సాధించి ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇక్కడితో ఆగకుండా ఇప్పుడు 95 ఏళ్ల నాటి డాన్ బ్రాడ్‌మాన్ అజేయ టెస్ట్ రికార్డును బద్దలు కొట్టేందుకు రెడీ అవుతున్నాడు. సిరీస్‌లోని చివరి టెస్టులో రెండు అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడితే, క్రికెట్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని ఘనతను గిల్ సాధించగలడు. అంటే, ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా డాన్ బ్రాడ్‌మాన్‌ను వెనక్కి నెట్టి చరిత్ర సృష్టిస్తాడు. ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో జరిగే చివరి టెస్ట్‌లో శుభమన్ గిల్ ఒకసారి కాదు, ఏకంగా నాలుగు సార్లు డాన్ బ్రాడ్‌మాన్‌ను అధిగమించే అవకాశం ఉంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు (974) సాధించిన రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన దిగ్గజ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. ఈ రికార్డును ఆయన 1930లో ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన యాషెస్ సిరీస్‌లో నెలకొల్పారు. ఇప్పుడు శుభమన్ గిల్ ఈ 95 ఏళ్ల పాత రికార్డును బద్దలు కొట్టడానికి




కేవలం 253 పరుగులు దూరంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్ చివరి టెస్ట్‌లో గిల్ ఈ అద్భుతాన్ని చేయగలడు. ఒకవేళ శుభమన్ గిల్ ఈ రికార్డును సాధిస్తే, ఓవల్ టెస్ట్‌లో అతను మొత్తం 4 సార్లు డాన్ బ్రాడ్‌మాన్ రికార్డులను బద్దలు కొట్టినట్లు అవుతుంది.ఒక టెస్ట్ సిరీస్‌లో బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక పరుగులు 974. ఇది డాన్ బ్రాడ్‌మాన్ పేరుతో ఉంది. అయితే, గిల్ ఈ రికార్డును చేరుకోవడానికి ముందు, డాన్ బ్రాడ్‌మాన్ సృష్టించిన మరో మూడు పరుగుల రికార్డులను కూడా దాటాల్సి ఉంటుంది. డాన్ బ్రాడ్‌మాన్ 1934లో ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన యాషెస్ సిరీస్‌లో 758 పరుగులు సాధించారు. ఆ తర్వాత, 1931–32లో సౌత్ ఆఫ్రికా



జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చినప్పుడు డాన్ బ్రాడ్‌మాన్ 806 పరుగులు చేశారు. మళ్ళీ 1936–37లో ఇంగ్లాండ్ జట్టు యాషెస్ కోసం ఆస్ట్రేలియాకు వచ్చినప్పుడు, డాన్ బ్రాడ్‌మాన్ ఆ సిరీస్‌లోని 5 టెస్టుల 9 ఇన్నింగ్స్‌లలో 810 పరుగులు చేశారు.శుభమన్ గిల్ టార్గెట్ డాన్ బ్రాడ్‌మాన్ 974 పరుగుల రికార్డును ఛేదించడమే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు కూడా అతడు అలా చేయాలని ఆశిస్తున్నారు. అయితే, గిల్ ఆ మార్కును అందుకుంటున్నప్పుడు, డాన్ బ్రాడ్‌మాన్ గతంలో సృష్టించిన మరో 3 రికార్డులను కూడా బద్దలు కొట్టబోతున్నాడని అర్థం. అంటే, ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో జరిగే చివరి టెస్ట్‌లో గిల్ కేవలం 2 ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, బ్రాడ్‌మాన్ పరుగుల రికార్డులను 4 సార్లు బద్దలు కొట్టే అవకాశం ఉంది.ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో శుభమన్ గిల్ 4 టెస్టుల 8 ఇన్నింగ్స్‌లలో 90.25 సగటుతో 722 పరుగులు సాధించాడు. ఇందులో 4 సెంచరీలు కూడా ఉన్నాయి. అతని మిగిలిన ఇన్నింగ్స్‌లు కూడా అదే దూకుడుతో ఉంటే, బ్రాడ్‌మాన్ ప్రపంచ రికార్డు అయిన 974 పరుగుల మార్కును మరింత దగ్గరవుతాడు. అయినప్పటికీ, ఇంకా అవకాశం ఉంది. ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగుల రేసులో తన కంటే 4 సార్లు ముందున్న బ్రాడ్‌మాన్‌ను గిల్ ఎన్నిసార్లు అధిగమిస్తాడో చూడాలి. ఒకటి, రెండు, మూడు లేదా మొత్తం 4 సార్లు అలా చేసి 95 ఏళ్ల ప్రపంచ రికార్డును బద్దలు కొడతాడా అనేది ఆసక్తికరంగా మారింది.

# వివాదానికి ఫుల్‌స్టాప్ పడినా?

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన నాలుగో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ చివరి దశలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య హ్యాండ్‌షేక్ విషయంలో కొంత వివాదం తలెత్తింది. మ్యాచ్ డ్రా అని దాదాపు ఖరారు కాగా.. భారత బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ తన తొలి టెస్ట్ సెంచరీలకు చేరువలో ఉన్నారు. ఆ సమయంలో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మ్యాచ్‌ను ముగించి.. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లతో చేతులు కలపాలని కోరుకున్నాడు. అయితే భారత ఆటగాళ్లు అందుకు నిరాకరించినట్లు తొలుత వార్తలు ప్రచారంలోకి వచ్చాయి.ఈ సంఘటనతో ఇంగ్లండ్ ఆటగాళ్లు కొంత అసంతృప్తితో



కనిపించారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. మ్యాచ్ ముగిసిన అనంతరం బెన్ స్టోక్స్.. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లతో హ్యాండ్‌షేక్ చేయలేదని ఆ వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో ఆధారంగా బెన్ స్టోక్స్‌పై విమర్శలు వెల్లువెత్తాయి.అయితే ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతూ .. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, క్రికెట్ వ్యాఖ్యాత మైఖేల్ వాన్ తన సోషల్ మీడియా ఖాతాలో మ్యాచ్ తర్వాత తీసిన ఒక కొత్త వీడియోను షేర్ చేశారు. ఈ వీడియోలో బెన్ స్టోక్స్.. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లతో చేతులు కలుపుతూ స్పష్టంగా



కనిపించాడు. బెన్ స్టోక్స్ చాలా తొందరగా హ్యాండ్‌షేక్ చేసి ముందుకు వెళ్లిపోవడంతో కొందరు కరచాలనం చేయలేదని తప్పుగా భావించి ఆ అపోహతోనే కొన్ని వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారని మైఖేల్ వాన్ ఈ వీడియో ద్వారా వివరించారు.ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు కూడా బెన్ స్టోక్స్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లతో చేతులు కలుపుతున్న చిత్రాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఈ వివాదంపై స్పష్టతనిచ్చింది. అంతే కాకుండా మ్యాచ్ తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బెన్ స్టోక్స్ స్వయంగా రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఇద్దరి అద్భుతమైన ఆటతీరును ప్రశంసించాడు.ఇది ఆట పట్ల బెన్ స్టోక్స్ క్రీడాస్ఫూర్తిని తెలియజేస్తుంది. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్ట్ సిరీస్‌లో ఐదో, చివరి మ్యాచ్ జులై 31న లండన్‌లోని ది ఓవల్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే సిరీస్‌లో ఇంగ్లండ్ 2–1తో ఆధిక్యంలో ఉండగా.. ఈ మ్యాచ్‌ను గెలిచి టెస్ట్ సిరీస్‌ను 2–2తో సమం చేయాలని శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు పట్టుదలతో ఉంది. ఈ కీలక మ్యాచ్‌లో టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.



# భారత మహిళా చెస్‌లో నూతన అధ్యాయం

జార్జియాలోని బటూమిలో జరిగిన ఫిడే ప్రపంచ కప్ 2025 ఫైనల్స్‌లో 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ భారత చెస్ చరిత్రలో అద్భుతమైన అధ్యాయాన్ని లిఖించింది. ఈ చారిత్రాత్మక విజయంతో కేవలం ఒక టైటిల్ గెలవడమే కాకుండా.. భారత మహిళా చెస్‌కు సరికొత్త దిశానిర్దేశం చేసింది. దివ్య సాధించిన ఈ విజయం మహిళా చెస్ రంగంలో మరింత మంది యువ ప్రతిభావంతులకు



స్ఫూర్తినిస్తుందని గ్రాండ్ మాస్టర్ ఆర్బీ రమేష్ అభిప్రాయపడ్డారు.దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 టైబ్రేకర్స్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిని ఓడించి, ఈ టైటిల్‌ను గెలిచిన మొదటి భారతీయురాలిగా నిలిచింది. అంతే కాదు ఆమె దేశానికి 88వ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించింది. ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ మహిళగా (కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, ఆర్. వైశాలి తర్వాత) ఆమె చరిత్ర సృష్టించింది.ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ పూర్తిగా భారతీయ క్రీడాకారిణుల మధ్య జరిగింది. ఇది భారతీయ చెస్ క్వీన్ కోనేరు హంపి, నాగ్‌పూర్ నుంచి వచ్చిన యువ ఛాలెంజర్ దివ్య దేశ్‌ముఖ్ మధ్య జరిగింది. రాపిడ్ గేమ్స్‌లో ఒక డ్రా కాగా.. రెండో గేమ్‌లో దివ్య నల్లపావులతో అద్భుత విజయాన్ని సాధించింది. వరల్డ్ నంబర్ 5, ప్రస్తుత వరల్డ్ రాపిడ్ ఛాంపియన్ అయిన కోనేరు హంపి చేసిన చిన్న పొరపాట్లను దివ్య తెలివిగా ఉపయోగించుకుంది."దివ్య దేశ్‌ముఖ్ టాన్ జోంగ్‌యీ, హారిక,



ఇప్పుడు హంపిని ఓడించింది. ఈ విజయం సాధించడానికి ఆమె అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించింది" అని ప్రపంచ చెస్‌లో అత్యంత గొప్ప కోచ్‌లలో ఒకరైన గ్రాండ్‌మాస్టర్ ఆర్‌బీ రమేష్ మైఖేల్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతూ అన్నారు. ఇంత చిన్న వయస్సులో ఈ విజయాన్ని సాధించడం నిజంగా అద్భుతమన్నారు. అనేక మంది భారతీయ చెస్ ప్రతిభావంతుల ఎదుగుదలను పర్యవేక్షించిన రమేష్.. దివ్యలో వచ్చిన మార్పు పట్ల గర్వం వ్యక్తం చేశారు. ఆమె ఇక కేవలం దూకుడుగా ఆడే క్రీడాకారిణి కాదన్నారు. ఆమె ఇప్పుడు పటిష్టమైన స్థానాలను ఆడుతోంది, ఎండ్‌గేమ్‌లను అన్వేషిస్తోందని చెప్పారు. ఒక యూనివర్సల్ ప్లేయర్‌గా మారుతోందని.. ఇది పరిపక్వతకు నిదర్శనమని కొనియాడారు. ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 విజేతగా దివ్య దేశ్‌ముఖ్ 50,000 డాలర్లు (సుమారు ?41.6 లక్షలు) ప్రైజ్ మనీ గెలుచుకుంది. రన్నరప్‌గా నిలిచిన కోనేరు హంపికి 35,000 డాలర్లు (సుమారు ?29.1 లక్షలు) లభించాయి. అయితే ఓపెన్ విభాగంలో విజేతకు 110,000 డాలర్లు లభిస్తుండగా.. మహిళా విభాగంలో సగం కంటే తక్కువ ప్రైజ్ మనీ ఉండటం గమనార్హం."టై–బ్రేక్‌లో, ఆట ఏ వైపుకైనా వెళ్లి ఉండవచ్చు, ఎందుకంటే ఇద్దరూ మంచి ఆటగాళ్లు, చాలా అలసిపోయారు. ఎవరైనా కుప్పకూలి తప్పులు చేసే అవకాశం ఉందని రమేష్ వ్యాఖ్యానించారు. “కాబట్టి దివ్య తన ఆలోచనలను అదుపులో ఉంచుకుని, చివరి తప్పు చేయకపోవడం చాలా మంచి విషయం. అటువంటి పెద్ద టోర్నమెంట్‌లో, కీలకమైన ఆటలో ఇది చాలా ముఖ్యం." అని పేర్కొన్నారు. ఆమె విజయం భారత చెస్ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు అని కోచ్ రమేష్ స్పష్టం చేశారు.ఇంతకు ముందు కేవలం ముగ్గురు భారతీయ మహిళలు మాత్రమే గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ను సాధించారని.. ఇప్పుడు ఒక టీనేజర్ ఈ ఘనతను సాధించిందని కోచ్ రమేష్ వెల్లడించారు. ఇది ఒక కీలక క్షణమని.. కేవలం వ్యక్తిగత మైలురాయి మాత్రమే కాదని, దేశంలో మహిళా చెస్‌కు ఒక జ్యోతిని వెలిగించిన క్షణమని ప్రశంసలు కురిపించారు. ఏళ్లుగా పురుషుల విభాగంలో గుకేష్, అర్జున్, ప్రజ్ఞానంద వంటి టీనేజ్ సంచలనాలను భారత్ తయారు చేసింది. అయితే రమేష్ చెప్పినట్లుగా, మహిళల విభాగంలో అలాంటి స్ఫూర్తి కనిపించలేదు. “ఈ విజయం ఆ పరిస్థితిని మార్చగలదు," అని ఆయన అన్నారు. ఇది ఎక్కువ మంది బాలికలను 18 ఏళ్లు నిండకముందే గ్రాండ్‌మాస్టర్‌లుగా మారాలని కలలు కనేలా ప్రోత్సహిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అహ్మదాబాద్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌గా నిలవడం నుంచి బుడాపెస్ట్‌లోని చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకానికి సహకరించడం వరకు, దివ్య ఎదుగుదల స్థిరంగా, అద్భుతంగా ఉంది. అయితే, బటూమి 2025 ఆమెకు ఒక పట్టాభిషేకం లాంటిది. ఒక ప్రపంచ కప్ ఛాంపియన్, ఒక గ్రాండ్‌మాస్టర్, ఒక టీనేజ్ ట్రెయిల్‌బ్లేజర్‌గా దివ్య దేశ్‌ముఖ్ కేవలం ఒక ట్రోఫీని గెలవడమే కాకుండా – కొత్త తలుపులను తెరిచింది.

అక్షరకలం

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ వర్మపై సుప్రీం ఆగ్రహం

## తప్పు లేకుంటే ముందే ఎందుకు స్పందించలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ,**

నోట్ల కట్టల వ్యవహారం కేసు జస్టిస్ యశ్వంత్ వర్మను వెంటాడుతోంది. ఇక త్రిసభ్య విచారణ కమిటీ– ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై బుధవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. నోట్ల కట్టలు వర్మవిగా కమిటీ– తేల్చింది. అయితే కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.వర్మ తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. న్యాయమూర్తిని తొలగించాలని అంతర్గత విచారణ ప్యానెల్ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదని.. రాజ్యాంగ విరుద్ధమని భావిస్తే విచారణకు ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ముందే సవాల్ చేయాల్సింది కదా? అని అసహనం వ్యక్తం చేసింది. న్యాయపరమైన తప్పులు జరిగినప్పుడు చర్య తీసుకునే హక్కు చీఫ్ జస్టిస్‌కు ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మార్చి 14న జస్టిస్ యశ్వంత వర్మ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి 11:43 గంటలకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని చెల్లాచెదురుగా పడి ఉన్న నగదును గుర్తించారు. అనంతరం ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నగదు వీడియోలను రికార్డ్ చేసి ఢిల్లీ పోలీసులు.. సీనియర్ అధికారులకు పంచారు. అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తికి సమాచారం అందించారు. దీంతో అప్పటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఖన్నా విచారణకు ఆదేశించారు. దాదాపు రూ.15 కోట్ల వరకు నగదు ఉంటు–ందని సమాచారం. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది.

# రష్యా సునామీతో ప్రపంచ దేశాల అప్రమత్తం

## జపాన్ తీరంతో పాటు, అమెరికాలోనూ ప్రభావం

## ప్రజలను అప్రమత్తం చేసిన ఆయాన దేశాలు

## సముద్ర తీరంలో ఎగిసి పడుతున్న రాకాసి అలలు

## చైనాలోనూ వాతావరణ బీభత్సం..భారీగా వర్షాలు

**మాస్కో,**

రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంలో బుధవారం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించడంతో దీని ప్రభావంతో రష్యా, జపాన్ తీర ప్రాంతాలను సునామీ తాకింది. పలుచోట్ల రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. వీటితో పాటు– ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, దీవులకు సునామీ ముప్పు పొంచి ఉంది. అమెరికాలోని ద్వీప రాష్ట్రం హవాయి మొత్తానికి సునామీ హెచ్చరిక జారీ అయింది. అలలు ఆరు అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. రాష్ట్రం మొత్తం సునామీ సైరన్లు వినిపించాయి. దాంతో పర్యాటకులు, స్థానికులు తమ స్వస్థలాలను వీడి ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఒక్కసారిగా రాష్ట్ర ప్రజలంతా తరలుతుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లన్నీ కారులతో బారులు తీరాయి. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక అలస్కాలోని కొన్ని ప్రాంతాలను అమెరికా వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది. అమెరికా వాతావరణ విభాగం కీలక హెచ్చరిక జారీ చేసింది. సునామీ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దని, ఫొటోల కోసం తీరానికి వెళ్లొద్దని చెప్పింది. ఒక్క అలతో సునామీ రాదని, అలలు పెద్దసంఖ్యలో వస్తాయని, సముద్రం నుంచి తీరానికి వచ్చే నీటి పరిమాణం భారీగా ఉంటుందని వెల్లడించింది. ఇదిలాఉంటే.. జపాన్ తీర ప్రాంతంలోని 9 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. చైనాకు ఈ ప్రకృతి విపత్తు ముప్పు పొంచి ఉంది. సునామీనే కాకుండా సైక్లోన్ ప్రమాదమూ ఉంది. దాంతో షాంఘైలోని 28 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విమానాలు, బోట్ సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. రష్యాలో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా దాంతోపాటు– చుట్టు–పక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకు పడ్డాయి. అలలు తాకిన దీవుల్లో రష్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ సునామీ వల్ల ఆయా ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి.

# సునామీ హెచ్చరికలతో భారత్ అప్రమత్తం

## అమెరికా తీర ప్రాంత ప్రజలకు హెచ్చిరకలు

## స్థానిక అధికారుల సూచనలు పాటించాలని ఆదేశం

## ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్న ట్రంప్

**న్యూయార్క్,**

రష్యాలో బుధవారం ఉదయం భారీ భూకంపం సంభవించడంతో రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ అప్రమత్తమైంది. ప్రజలంతా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సునామీ ముప్పును శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. కాలిఫోర్నియా, హవాయితో పాటు అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అమెరికా అధికారులు జారీ చేసే అలర్ట్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పాటించాలి. సునామీ హెచ్చరికలు జారీ అయితే.. వెంటనే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లండి. తీర ప్రాంతాలకు దూరంగా ఉండండి. అత్యవసర పరిస్థితికి సిద్ధమవ్వండి. మీ ఎలక్ట్రానిక్ పరికరాలకు ఛార్జింగ్ ఉండేలా చూసుకోండి. సాయం కోసం ఎమర్జెన్సీ నంబర్లను సంప్రదించండని కాన్సులేట్ జనరల్ 'ఎక్స్'
ఖాతాలో వెల్లడించింది. మరోవైపు, తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పసిఫిక్ మహా సముద్రంలో భారీ భూకంపం కారణంగా హవాయి ప్రాంతానికి సునామీ అలర్ట్ జారీ అయ్యింది. అమెరికాలోని పసిఫిక్ తీర ప్రాంతాలకూ ముప్పు పొంచి ఉంది. ప్రజలంతా ధైర్యంగా ఉండండి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి. అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటించండని అధ్యక్షుడు సూచించారు. రష్యా తీర ప్రాంతమైన పెట్రోపావ్లోవ్స్క్–కామ్చాట్స్కీ లో బుధవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 8.8గా నమోదైంది. దీంతో రష్యాలోని కురిల్ దీవులు, జపాన్ దీవులను సునామీ తాకింది. రాకసి అలలు భారీగా ఎగసిపడుతున్నాయి. భూకంపం కారణంగా అనేక భవనాలు కొన్ని నిమిషాల పాటు– కదిలాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మరోవైపు, సునామీ నేపథ్యంలో ఇప్పటికే పలు తీర ప్రాంతాలను వరద ముంచెత్తినట్లు– తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపార వనరులు

## వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలు

## పెట్టుబడులతో రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కండి

## సింగపూర్‌లోని వివిధ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు

**అమరావతి,**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపార వనరులున్నాయని...వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడులతో



వచ్చి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్‌లోని వివిధ దిగ్గజ సంస్థల ప్రతినిధులను కోరారు. సింగపూర్ పర్యటన చివరి రోజున పలు కంపెనీలకు చెందిన ప్రముఖులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. వివిధ రంగాల్లో భారీ ఎత్తున పెట్టు–బడులు పెట్టి...కీలక కంపెనీలుగా ఉన్న కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వేర్వేరుగా భేటీ– అయ్యారు. రియలెస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజటల్ టౌన్ షిప్స్ వంటి అంశాలపై కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు సంజీవ్ దాస్ గుప్తా, గౌరీశంకర్ నాగభూషణంలతో సీఎం చర్చించారు. అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ– పార్కులు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటు–కు అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వారికి వివరించారు. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టుల ద్వారా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకున్నామనే అంశాన్ని సీఎం చర్చించారు. హైదరాబాద్–బెంగళూరు–అమరావతి–చెన్నైల మధ్య ఎయిర్ పోర్టు ఎకనమిక్ కారిడార్ గురించి సీఎం ఆ సంస్థ ప్రతినిధులకు చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఉన్న మొత్తం ఐటీ– పార్కుల్లో 30–35 శాతం ఐటీ– పార్కుల్లో తాము పెట్టుబడులు పెట్టామని ఆ సంస్థ ప్రతినిధులు చంద్రబాబు దృష్టికి తెచ్చారు. రియల్ ఎస్టేట్ సహా పారిశ్రామిక రంగాల్లో ఏపీలో పెట్టు–బడులు పెట్టేందుకు కెపిటాల్యాండ్ ఇండియా ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సంస్థతో జరిగిన సమావేశంలో వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయో డైవర్శిటీ– కాంప్లెక్సులు, వైల్డ్ లైఫ్ ఎక్స్ పీరియెన్స్ జోన్ల ఏర్పాటు– వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. వైజాగ్, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజం రంగంలో భాగస్వామ్యంతో వెళ్తే మంచి చక్కటి అభివృద్ధి సాధించవచ్చని ఆ గ్రూప్ సీఈఓ మైక్ బార్క్‌లేకు సీఎం సూచించారు. సింగపూర్ గార్డెన్ సిటీ–, జూ పార్క్ మోడళ్లను ఏపీలో అమలు చేసే అంశంపై సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. వైజాగ్‌లో డాల్ఫిన్ సిటీ–, అమరావతిలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు– చేసేందుకు ప్రణాళికలతో వెళు _న్నామని.. వాటిల్లో మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయాలని కోరారు. ఈ మేరకు ఆయా రంగాల్లో ఏపీలో పెట్టు–బడులు పెట్టేందుకు బార్క్ లే సుముఖత వ్యక్తం చేశారు. ఇక పరిశ్రమలు, మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టు–బడులపై జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పోరేషన్–ఃూఇఈ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో ముఖ్యమంత్రి సమాలోచనలు జరిపారు. లేపాక్షి, ఓర్వకల్లు ప్రాంతాల్లో ఏర్పాటు– చేయబోతున్న డ్రోన్ సిటీ–, డిఫెన్స్, సివిల్ ఎరో స్పేస్ కారిడార్ వంటి ప్రాజెక్టుల గురించి రాజీవ్ కన్నన్‌కు సీఎం వివరించారు. ఓర్వకల్లు, లేపాక్షిల్లోని ప్రాజెక్టులకు అవసరమైన మేరకు ఫైనాన్సింగ్ చేసే అంశంపై కన్నన్‌తో కీలక చర్చ జరిగింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, పారిశ్రామి కారిడార్ల ప్రణాళికలకూ సహకారం అందించాలని సీఎం కోరారు. ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లెండింగ్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టు–బడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని రాజీవ్ కన్నన్ చెప్పారు. పెట్టుబడుల రంగంలో దిగ్గజ కంపెనీగా ఉన్న –టె–మాసెక్ హెల్డింగ్స్ సంస్థకు చెందిన పోర్ట్ ఫోలియో డెవలప్మెంట్, కార్పోరేట్ స్ట్రాటజీ విభాగం జాయింట్ హెడ్ దినేష్ ఖన్నాతో సీఎం చంద్రబాబు కీలక చర్చలు జరిపారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఆ సంస్థ నుంచి సహకారం కోరారు. ఎంఎస్ఎంఈ రంగంలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు భాగస్వాములుగా ఉండేందుకు టెమాసెక్ హెల్డింగ్స్ ఆసక్తి కనబరిచింది. అలాగే ఏపీఐఐసీతో కలిసి పనిచేస్తే అభివృద్ధికి మరింత ఉపయుక్తంగా ఉంటుందని సీఎం సూచించారు. దీంతోపాటు– వివిధ రంగాల్లో జాయింట్ వెంచర్ ప్రాజెక్టులు చేపట్టే అంశంపైనా చంద్రబాబు–దినేష్ ఖన్నా మధ్య జరిగిన చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యారోగ్యం, టెక్నాలజీ, సుస్థిర మౌలిక వసతుల కల్పన వంటి రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను దినేష్ ఖన్నాకు సీఎం వివరించారు. ఈ మేరకు వివిధ రంగాల్లో ఎంఓయూలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామని ఖన్నా చెప్పారు. ఈ వరుస సమావేశాల్లో మంత్రులు నారాయణ, టీ–జీ భరత్, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన చంద్రబాబు సింగపూర్ పర్యటన

## నాలుగు రోజులపాటు పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు

## పలు సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఒప్పందాలు

## పర్యటన ముగించుకుని బయలుదేరిన బాబు బృందం

**అమరావతి,**

పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా పూర్తయ్యింది. మంత్రులు నారా లోకేష్ , పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు– అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు




వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ–, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ–సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గత పాలకుల చర్యల కారణంగా ఏపీ సింగపూర్ మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించటంలో ముఖ్యమంత్రి సఫలీకృతం అయ్యారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేలా చేయగలిగారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు– అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14–15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు. సింగపూర్ లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి బృందానికి సహాయ సహకారాలు అందించారు. మరోవైపు సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్ఐఏ ఇంజనీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పోరేషన్, జీఐసీ, ఎస్ఎంబీసీ, కాపిటాల్యాండ్ ఇన్వెస్ట్మెంట్, ఎవర్సెండై ఇంజనీరింగ్, టామ్ సెక్, విల్మర్, టీవీఎస్ మోటార్స్, మండై వైల్డ్ లైఫ్, అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలోని అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. పెట్టు–బడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి సీఎం అవగాహన కల్పించారు. భారతదేశంలో పెట్టు–బడులకు ఏపీ గమ్యస్థానంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోకి వచ్చే కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు– సీఎం చెప్పారు. పట్టణాభివృద్ధి, ఐటీ–, ఏఐ, ఫినటెక్, మారి–టైమ్, పోర్ట్స్ మౌలిక సదుపాయాలపై నిర్వహించిన వేర్వేరు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఇక్కడి వనరుల్ని వినియోగించుకుని పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలను
కోరారు. దీంతో పాటు– సింగపూర్ లోని ప్రతిష్టాత్మక హౌసింగ్ ప్రాజెక్టు బిడదారి ఎస్టేట్, జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్, టు–వాస్ పోర్టు, సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ను సీఎం బృందం సందర్శించింది. ఆయా ప్రాజెక్టుల్లో అమలు చేస్తోన్న అత్యుత్తమ, ఆధునిక విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రవేశ పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించింది. మొత్తం పర్యటనలో సింగపూర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా సమావేశం విశేషంగా నిలిచింది. పర్యటన ఆరంభంలో సింగపూర్ తో పాటు– సమీపంలోని ఐదు దేశాల నుంచి వచ్చిన తెలుగువారు ఆత్మీయ, అభిమానాలతో ముఖ్యమంత్రి బృందానికి ఘనస్వాగతం పలికారు. పర్యటన చివరి రోజైన బుధవారం కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్రానికి తిరుగు ప్రయాణం అయ్యారు. పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన సీఎం చంద్రబాబుకు సింగపూర్ లోని తెలుగు ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన బసచేసిన హోటల్ కు తరలి వచ్చిన స్థానిక తెలుగు ప్రజలు.. వీడ్కోలు పలికే సమయంలో జై సీబీఎన్ అంటూ నినాదాలు చేశారు. మరోవైపు సింగపూర్ లోని తెలుగు ప్రజలు చూపిన అత్మీయతకు, ప్రేమాభిమానాలకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. సింగపూర్ నుంచి బయల్దేరిన సీఎం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెంటనే బయల్దేరి రాత్రికే విజయవాడ చేరుకోనున్నారు.



# క్రీడాకారిణులను సన్మానించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి



అక్షర కలం /ప్రతినిధి

నల్లగొండ:నార్వేలో జరుగుతున్నటువంటి స్లంసాకర్ హెూమ్ లెస్ ఇంటర్నేషనల్ వరల్డ్ కప్ కి నల్లగొండ జిల్లా నుండి ఎన్నిక కాబడిన క్రీడాకారినీ లావణ్యను మరియు ఫిఫా అకాడమీకి ఎన్నిక కాబడిన క్రీడాకారిణి పవిత్రను ఈరోజు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి పార్టీ కార్యాలయము నందు పట్టణ అధ్యక్షులు శ్రీ గుమ్ముల మోహన్ రెడ్డి గారు సన్మానించి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమములో ఫుట్బాల్ కోచ్ కే. దాసు, సునీత గారు, రజిత , రఫీ మరియు జాతీయస్థాయి క్రీడాకారులు సిద్ధార్థ, సోనీ మరియు సాగర్ పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరం

## సమస్యలపై చిత్తశుద్ధి లేని సిఎం రేవంత్ రెడ్డి

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆందోళన

హైదరాబాద్

:తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలను వెంటాడుతున్న సమస్యలు, విద్యార్థుల నిరసనలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవిష్యత్ రోడ్డెక్కిందని సీఎం రేవంత్ రెడ్డిపై నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ పాలనలో గురుకుల విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కారు. నేడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తమ సమస్యల పరిష్కారం కోసం గురుకుల పాఠశాలల విద్యార్థులు రోడ్లెక్కుతున్నారు అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గద్వాల జిల్లా అలంపూర్ మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో తాగునీరు రాక ఉప్పు నీరు తాగుతున్నామని, పురుగుల అన్నం తింటు-న్నామని, మరుగుదొడ్లు సరిగ్గా లేక బహిర్భూమికి పంట పొలాల్లోకి వెళ్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనం అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం బడిపిల్లల పాదయాత్రను కూడా బెదిరించి విద్యార్థులను డీసీఎంలో ఎక్కించి వెనక్కి తీసుకెళ్లడం కాంగ్రెస్ సర్కార్ నిర్బంధానికి నిదర్శనం. సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసింది అని నిప్పులు చెరిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో గురుకుల విద్యార్థులు 150 మంది కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలయిన ఘటన మరవక ముందే పుల్లూరు విద్యార్థులు రోడ్డెక్కడం ఈ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. గురుకులాల్లో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలపై ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

# తమిళనాడు బిజెపి ఉపాధ్యక్షురాలిగా ఖుష్బూ

చెన్నై,

ప్రముఖ సినీ నటి, భాజపా నాయకురాలు ఖుష్బూ సుందర్‌కు భాజపాలో ముఖ్యమైన పదవి దక్కింది. త్వరలో తమిళనాడు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీపరంగా ఆమెకు కీలక పదవిని కట్టబెట్టారు. తమిళనాడు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆమె నియమితులయ్యారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదంతో కొత్త రాష్ట్ర వర్గాన్ని నియమించినట్లు- ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 14మంది నియమితులు కాగా.. ఈ జాబితాలో ఖుష్బూ సుందర్‌కు చోటు దక్కింది. అలాగే, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, రాష్ట్ర కార్యదర్శులుగా 14 మందితో కూడిన జాబితాను నయనార్ నాగేంద్రన్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసుకున్నారు. ఖుష్బూ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, భాజపా జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ- సభ్యురాలిగా కొనసాగుతున్న వి

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై దోబూచులాట

## కాంగ్రెస్, బిజెపిల తీరుపై

## మండిపడ్డ వినోద్

హైదరాబాద్,

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ఈ విషయంలో రెండు పార్టీలు ఇంకా మోసం చేయాలని చూస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అనుకుంటే గంటలోపు బిల్లుకు ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు. శాసనసభ, మండలి బిల్లు ఆమోదించిన అంశంపైనే ఆర్డినెన్స్ సాధ్యం కాదని.. కాంగ్రెస్, భాజపాలు బీసీలను ఎందుకు మోసం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, చట్టసవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తేనే న్యాయపరమైన రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రైవేట్ బిల్లు పె-÷-టటొ-చ్చు కదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అడగరు, మోదీ చేయరు, అన్నట్లు- కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 243ఉలోని ఈ క్లాజ్‌కు సవరణ చేసినా కూడా బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతుందని వినోద్ తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉండి ధర్నాలు అంటూ డ్రామాలు చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో కలిసి వెళ్లి మోదీని అడగాలని సీఎం రేవంత్‌కు సూచించారు. భాజపాకు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ హయాంలో ఆమోదించిన, రేవంత్ రెడ్డి హయాంలో ఆమోదించిన బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బిజెపి కూడా తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.

# శ్రీవాణి టిక్కెట్ల దర్శనంలో మార్పులు

## ఉదయం టిక్కెట్ పొందితే సాయంత్రం దర్శనం

తిరుమల,

శ్రీవాణి టికెట్లపై శ్రీవారి దర్శన విధానంలో తితిదే స్వల్ప మార్పులు చేసింది. ఇక టిక్కెట్ పొందిన రోజే దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేసింది. ఉదయం టిక్కెట్ పొందితే సాయంత్రానికి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం శ్రీవాణి టికెట్‌పై దర్శనానికి మూడు రోజులు పడుతోంది. ఇకపై ఏ రోజు టికెట్ తీసుకుంటే ఆరోజే దర్శనానికి తితిదే వీలు కల్పించనుంది. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఉదయం ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ పొందిన భక్తులు.. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 వద్ద రిపోర్టు చేయాల్సి ఉంటు-ంది. నవంబర్ 1వ తేదీ నుంచి తితిదే దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనుంది. శ్రీవాణి టికెట్ల జారీలో ఎలాంటి మార్పు లేదని తితిదే అధికారులు స్పష్టం చేశారు. యథావిధిగా తిరుమలలో ఉదయం 10గంటల నుంచి మొదటి వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యతగా 800 టికెట్లు-, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లు జారీ చేస్తామని చెప్పారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబర్ 31 వరకు ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లు- పొందిన భక్తులకు యథావిధిగా ఉదయం 10 గంటలకు దర్శనం కల్పిస్తామని తితిదే అధికారులు తెలిపారు.

# చురుకుగా ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ పనులు

హైదరాబాద్,

గణేశ్ ఉత్సవాలు దగ్గర పడుతుండటంతో ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహం పనులు వేగం పుంజుకున్నాయి. ఈ సంవత్సరం 69 అడుగుల శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. మూడు నెలల ముందే కర్రపూజతో ప్రారంభమైన ఈ పనులు శరవేగంగా ఊపందుకున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహం తయారీ పనుల గురించి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

# జగన్ బలప్రదర్శన కోసమే నెల్లూరు పర్యటన

## మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి

నెల్లూరు,

మాజీ సీఎం జగన్ వల్ల ఎంతో మంది జైలుకు వెళ్లారని.. వాళ్లని పరామర్శించకుండా నెల్లూరుకు ఎందుకు వస్తున్నారని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. కావాలనే బలప్రదర్శన చేయాలన్నదే జగన్ లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటి వరకు జగన్ పర్యటనలన్నీ ఇలాగే సాగాయని అన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అంత మంచివాడా? అని ఎద్దేవా చేశారు. బుధవారం నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. గురువారం నెల్లూరులో జగన్ పర్యటన ముగిసిన తర్వాత శుక్రవారం కాకాణి దుర్మార్గాలను బయటపెడతానని చెప్పారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, ధనుంజయ్ రెడ్డి ఇలా ఎంతో మంది జగన్ మాట విని జైలుపాలయ్యారు. వాళ్ల కుటుంబసభ్యులను పరామర్శించకుండా కాకాణినే ఎందుకు పరామర్శించడానికి వస్తున్నారు?పాపాలు చేసిన వారిని అరెస్టు చేస్తే వాళ్లని చూడటానికి వస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. అందుకే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చెప్పారు.

# దారితప్పిన మహిళా టీచర్ అరెస్ట్

ముంబై,

విద్యాబుద్ధులు నేర్పాల్సిన మహిళ టీచర్ దారితప్పింది. ఓ విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించింది. దీంతో పోలీసులు అమెను అరెస్ట్ చేశారు. నవీ ముంబై ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 35 ఏళ్ల మహిళ టీ-చర్ ఓ మైనర్ విద్యార్థికి ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు- ఇతర సోషల్‌మీడియా అకౌంట్లకు అసభ్యకర సందేశాలు పంపించేది. అంతేకాక.. అతనికి సెమీ న్యూడ్‌గా కాల్స్ చేసేది. దీంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని చెప్పాడు. వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టీ-చర్ ప్రవర్తన తమ కుమారుడి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపించినట్లు- ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు టీ-చర్‌ని అరెస్ట్ చేశారు. ఈ విద్యార్థితోనేనా.. లేక ఇతర విద్యార్థులతో కూడా ఇలాగే ప్రవర్తించేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పడే ఓటిటిలోకి వీరమల్లు

21 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారం

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్‌తో ఫర్వాలేదని అనిపించుకుంటోంది. మూడేండ్ల తర్వాత పవన్ నటించిన చిత్రం అవడం, హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ కావడం ఈ సినిమాకు మంచి హైప్ తీసుకు వచ్చాయి. అదీగాక ఎన్నడు లేనిది పవన్ కల్యాణ్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఓ రేంజ్‌లో ప్రమోషన్స్ చేయడం ఈ సినిమాకు బాగా కలిసి వచ్చి అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. అయితే.. ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధం అవుతోంది. ఇప్పుడీ చిత్రం ఆగష్టు 21 గురువారం నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో లో స్ట్రీమింగ్‌కు రానుంది. 17వ శతాబ్దంలో నడిచే కథగా రూపొందిన ఈ చిత్రంలో కృష్ణా తీరంలో లభించిన కోహినూర్ వజ్రం అనేక రాజుల చేతులు మారి మొగలుల చెంతకు చేరుతుంది. అదే సమయంలో దొంగతనాలు చేస్తూ నాటి బ్రిటీష్ వాళ్లకు, పాలెగాళ్లకు సింహస్వప్నంలా మారతాడు వీరమల్లు. ఓ చోరీ విషయంలో నాటి కుతుబ్ షాహీ సైనికులకు చిక్కుతాడు. అయితే.. దక్కన్ ఆత్మ గౌరవానికి చిహ్నమైన కోహినూర్ వజ్రాన్ని మొగలుల వద్ద నుంచి తీసుకు వస్తే అడిగింది ఇస్తా, చేస్తా అని ఆ రాజు మాట ఇవ్వడంతో ఢిల్లీ ప్రయాణం స్టార్ట్ చేస్తాడు. ఈక్రమంలో వీరమల్లుకు ఎదురైన ఘటనలు, అదే సమయంలో హిందువులపై జరుగుతున్న దాడుల విషయంలో ఏం చేశాడు, అసలు వీరమల్లు ఎవరు, అతని వెనక దాగి ఉన్న రహస్యం ఏంటి, చివరకు ఔరంగజేబుకు ఎదురు పడ్డాడా లేదా అనే పాయింట్ సినిమా సాగుతుంది. ముఖ్యంగా కీరవాణి సంగీతం ఈ సినిమాకు సెకండ్ హీరో అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సినిమా చూస్తున్నంత సేపు ఎక్కడా బోర్ కొట్టనప్పటికీ అసలు మ్యాటర్‌కు వెళ్ళక పోవడమే కాస్త నిరూత్సాహ పరుస్తుంది.

# దళితుల హక్కులను కాపాడటమే లక్ష్యం

## ఎస్సీ కమిషన్ చైర్మన్ చైర్మన్ కెఎస్ జవహర్

అమరావతి,

దళితుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లో గల ఎస్సీ కమిషన్ ఆఫీస్ లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం, కుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ ఏడాది మొత్తం 135 ఎట్రాసిటీ- కేసులు వచ్చాయని, అదేవిధంగా 3 నెలల్లో 78 కేసులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 13 ఎట్రాసిటీ- కేసులు వస్తే అందులో 3 కేసులు మాత్రమే నమోదు చేశారన్నారు. దీన్ని భట్టి చూస్తే అట్రాసిటీ- కేసులు వచ్చినా అధికారులు వాటిని నమోదు చేయడం లేదని అని అన్నారు. కొద్దిమంది అధికారులు కేసుల నమోదు చేయడంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు దారుడు పోలీస్ స్టేషన్ కు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి బాధలో ఉన్నవాడు తమ దగ్గరకు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సవివరమైన రిపోర్టు పంపించాల్సి ఉందన్నారు. కమిషన్ చైర్మన్‌గా విశేషాధికారాలు ఉంటాయని, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిష్కారంలో రాజీపడేది లేదన్నారు. భూములకు సంబంధించి రీసర్వేలో పోలీసులకు ఏమైనా ఫిర్యాదులు వస్తే తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్స్ లో సీట్ల కోసం చాలా డిమాండ్ ఉందని 300 సీట్లకు గాను 3,000 మంది విద్యార్థులు అ÷-లపై చేసే పరిస్థితులు ఉన్నాయని, అధికారులు దీన్ని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుబ్రహ్మణ్యం హత్య విషయంలో ఎమ్మెల్సీ అనంత బాబు కేసు పై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతి చెందిన డాక్టర్ సుధాకర్ విషయంలో కూడా అవసరమైన న్యాయం చేస్తామన్నారు. వేధింపులతో పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు ఊరట నిచ్చేలా పోలీసులు వ్యవహరించి అట్రాసిటీ- పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. బాధితులు పోలీసు స్టేషన్ కు వస్తే కేసులు పెట్టడం లేదని, అధికారులు నిర్లిప్తింగా వ్యవహరిస్తున్నారన్నారు. కర్నూలు, నంద్యాలలో ఎక్కువగా అట్రాసిటీ- కేసులు వస్తున్నాయన్నారు.

# అర్ధరాత్రి తలుపులు తట్టి నోటీసులు

## జగన్ ఫోటో ఉన్న వారందరికీ తాఖీదులు

## లిక్కర్ కేసులో సిట్ కట్టు కథలకు అడ్డే లేదు

## వైఎస్ జగన్ పర్యటనల మీద విషం చిమ్ముతున్నారు

## బ్రిటిషర్లకు..మీకు తేడా లేదు...వారికి

## పట్టిన గతే మీకూ పడుతుంది

## వైకాపా నేత మాజీమంత్రి పేర్నినాని ఘాటు విమర్శలు

అమరావతి,

అర్ధరాత్రి వైసీపీ మహిళా నేతల ఇంటి తలుపు తీసి నోటీసులు తీసుకుని వెళ్లమని చెబుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మీకు ఏం పోయేకాలం వచ్చిందని, అర్ధరాత్రి నిద్రలేపి నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. నెల్లూరులో ఉన్న 40 శాతం ఓటర్లకు నోటీసులు ఇచ్చారని, ఇంట్లో వైఎస్ జగన్ ఫోటో ఉంటే చాలు నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బ్రిటీష్ వాళ్లకు, చంద్రబాబు నాయుడుకు తేడా ఉందా? అని.. మహాత్మా గాంధీని కూడా రోడ్డు మీదకు రాకుండా చేస్తే ఎవరైనా ఆగారా? అని అడిగారు. ఆనాటి బ్రిటిష్ పాలకులకు ఏ కర్మ పట్టిందో.. మీకు కూడా అదే కర్మ పడుతుంది అని పేర్ని నాని అన్నారు. లిక్కర్ కేసులో సిట్ కట్టు కథలకు అడ్డే లేదు. మీరు ఎన్ని కట్టు-కథలు చెప్పినా జంకేది లేదు. వైఎస్ జగన్ పర్యటనల మీద విషం చిమ్ముతున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఎలా అయినా తిరగొచ్చు. ఆఖరికి చంద్రబాబు సతీమణి కూడా ఎన్ని కార్లయినా తీసుకుని వెళ్ళొచ్చు. పవన్ కళ్యాణ్ రైతుల ఆత్మహత్యల పేరిట పెద్ద మీటింగులు పెట్టారు. మేము అనుమతులు ఇవ్వకపోతే మీరు పర్యటనలు చేసేవారా?. ఊరేగింపులు ఎందుకు చేస్తున్నారు అని జగన్ అడిగారా?. లోకేష్ మూడు కార్లలోనే వెళ్లారా. చంద్రబాబు లెక్కపెట్టి వాహనాలు పెట్టుకున్నారు. మీరు ఇప్పుడు భయంలో ఉన్నారు. ప్రజల్లో మీపై వ్యతిరేకత పెరిగింది. జగన్ రాగానే ధైర్యం వస్తుంది.. ఆయన కోసం చుస్తున్నారు. జైలు దగ్గర 10 కంటే ఎక్కువ వస్తే కేసు పెడతాం అని నోటీసు ఇచ్చారు. అర్ధరాత్రి వైసీపీ మహిళా నేతలకు పోలీసులు తలుపు తీసి నోటీసులు తీసుకుని వెళ్లమని చెబుతారు. మీకు ఏం పోయే కాలం వచ్చింది.. నిద్రలేపి నోటీ-సులు ఇస్తారా?. నెల్లూరులో ఉన్న 40 శాతం ఓటర్లకు నోటీ-సులు ఇచ్చారు. ఇంట్లో జగన్ ఫోటో ఉంటే చాలు నోటీ-సులు ఇస్తున్నారు. బ్రిటీ-ష్ వాళ్లకు, చంద్రబాబుకు తేడా ఉందా. మహాత్మా గాంధీని కూడా రోడ్డుమీదకు రాకుండా చేస్తే ఎవరైనా ఆగారా. ఆనాటి బ్రిటిష్ పాలకులకు ఏ కర్మ పట్టిందో.. మీకు కూడా అదే కర్మ పడుతుంది' అని పేర్ని నాని అన్నారు. వైఎస్ జగన్ మీద జనాలకు ఉన్న ప్రేమను అణగదొక్కటం మీ వల్ల కాదు. తురకా కిషోర్ వడ్డెర కులానికి చెందిన యువనేత. ఇప్పుడిప్పుడే రాజకీయం ఎదుగుతూ మున్సిపల్ చైర్మన్ అయ్యారు. విజయవాడ నుంచి ఇద్దరు ఆకు రౌడీలు మాచర్ల వెళ్లి తొడగొడితే కొన్ని పరిణామాలు జరుగుతాయి. ఎన్నాళ్లు ఆయనను జైళ్లో పెట్టగలరు. మీ ప్రభుత్వం కూలేదాకా పెట్టగలరు. ఇప్పటికి ఏడాది అయ్యింది.. ఇంకొక నాలుగేళ్లు పెట్టు-కోండి. ఐదేళ్లు ఒక్క మనిషిని జైళ్లో మగ్గపెడితే ఆ తర్వాత విచారణ జరగదా. పాపం పండితే అన్నీ జరుగుతాయి. మీరు ఎన్ని వేధింపులు చేసినా ఎన్నికల్లో మీ కూటమి ప్రభుత్వం కుప్పకూలటం ఖాయం. కిషోర్ కుటు-ంబంతో పాటు- ప్రతీ వైసీపీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది. చేసిన పాపం వాళ్ళు మూట కట్టుకుంటారు. మళ్ళీ చెవిరెడ్డి, బాలాజీ గోవిందప్పను తీసుకువచ్చారు. జగన్ రెడ్డికి షేర్ ఉంది.. తీసుకువచ్చాం అంటారు. జగన్ వ్యాపారాలు చేసుకోకూడదా?. ఇప్పుడు మళ్ళీ వరుణ్ అంటున్నారు. ఒంగోలు టోల్ గేట్ దగ్గర పట్టు-కున్న డబ్బులు కూడా జగన్ గారివే అనేలా ఉన్నారు. వంద రోజులు అయ్యింది.. వీళ్లు వయసై పోయినవాళ్ళు. బెయిల్ వస్తుందని కొత్త కథ అల్లుతున్నారు. కాసేపు ఒకరకంగా.. ఇంకా కాసేపటికి మరోలా మాట్లాడుతున్నారు. అందరికీ బెయిల్ వాదనలు జరుగుతున్నాయని కేసును లైన్లోకి తెస్తున్నారు. లక్ష కోట్ల నుంచి మూడు వేల కోట్లు- అన్నారు. చివరికి లక్ష కోట్ల నుంచి 11 కోట్లకు తెచ్చారు. డబ్బాలు 12 అంటే.. కోట్లు- 11 అంట.. మిగతా కోటి ఎవరు నొక్కేసినట్లు-. అసలు ఫైనల్ ఛార్జ్ షీట్ వేస్తారో లేదో కూడా తెలియదు. అసలు ఆ డబ్బులు ఎవరివి. అంత లిక్కర్ కింగ్ ఇన్నాళ్లు 11 కోట్లు- వాళ్ళ దగ్గర పెడతారా' అని మాజీ మంత్రి ప్రశ్నించారు. వైఎస్ జగన్ మీలా నేరం చేసి ఉంటే వీళ్లను ఇండియాలో ఉంచుతారా. మీరు శ్రీనివాస్ ను అమెరికా పంపినట్లు- పంపరా.. రెండు వేల కోట్ల రూపాయల లెక్కలు చూపని డబ్బు చంద్రబాబు పీఏ దగ్గర దొరికిందని ఇన్కంటాక్స్ అధికారులు నోటీ-సులు ఇచ్చారు. మళ్ళీ చంద్రబాబు పీఏ విదేశాలకు వెళ్లిపోయారు. చంద్రబాబు సీఎం కాగానే వచ్చి ఉద్యోగం చేరాడు. మీకు మూటలు మోసాడు కాబట్టి వెంటనే ఉద్యోగం ఇచ్చారు. మేము లిక్కర్ పాపం చేసి ఉంటే వీళ్ళందరూ ఎప్పుడో దేశం దాటి ఉండేవారు. మేము కూడా పంపేవాళ్ళం కదా. మేం ఏదైనా ఫేస్ చేస్తామని ఉన్నాం. జగన్ కు బాధ్యత లేదు కాబట్టి బెంగుళూరు వెళ్ళి వస్తున్నారు. మీకు అన్నీ బాధ్యతలు ఉన్నాయి, మీరు ఎందుకు హైదరాబాద్ వెళ్తున్నారు.

# పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

నగరంలోని ప్రకాష్ నగర్ లో గల పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు.సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు పరిశీలించారు.రోడ్ల మరమ్మత్తులు, వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు పై పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# ఎర్రబోడులో" జేసీబీ లను అడ్డుకున్న "పోడు సాగుదారులు"

-ప్లాంటేషన్ పోడుకు వెళ్తున్న జేసీబీల అడ్డగింత

- ప్రత్యామ్నాయం చూపించగలరు పోడుదారులు

"వెంకన్న నాయక్ ఎఫ్‌డీవో" హామీతో ఆందోళన విరమణ



అక్షర కలం/ కారేపల్లి:

కారేపల్లి: ప్లాంటేషన్ పోడులో ఫారెస్టు అధికారులు పనులు ప్రారంభించారు. ప్లాంటేషన్ పోడుపై పోడుదారులు, ఫారెస్టు మధ్య వివాదం సాగుతూ ఉద్రిక్తలకు దారితీసి కేసుపెట్టుకునే వరకు వచ్చింది. ఈక్రమంలో ఫారెస్టు అధికారులు వివాదస్పద ప్లాంటేషన్ పోడులో మంగళవారం నుండి పనులు ప్రారంభించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధిలోని పోలీస్ సిబ్బంది సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య ఫారెస్టు అధికారులు బుధవారం కూడా పనులు చేయటానికి 9 జేసీబీలతో ప్లాంటేషన్ పోడుకు వెళ్తుండగా పోడుదారులు అడ్డుకున్నారు. మూడు జేసీబీలను అడ్డుకోని తమకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ప్లాంటేషన్‌లో పనులు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు, పారెస్టు అధికారులు పోడుదారులతో మాట్లాడారు. పోడుపై హక్కులు తెచ్చుకుంటే మీ జోలికి రామన్నారు. ప్లాంటేషన్ వేయాలని లక్ష్యం కోసం ప్రత్యామ్నాయం పోడు చూపుతామని మభ్యపుచ్చి మా జీవితాలు ఆగం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతోమాట్లాడి పట్టాలు తేచ్చుకోవాలని తమ విధులకు ఆటంకం కల్పించవద్దని సూచించారు. ప్లాంటేషన్ వేయటానికి ప్రత్యామ్నాయ పోడు చూపుతామని ఫారెస్టు అధికారులే హామీ ఇచ్చారని, ఇప్పుడు ప్రభుత్వం ద్వారా హక్కు తెచ్చుకోవాలని చెప్పటం ఎంతవరకు సమంజసమన్నారు. కేసులు పెట్టి నిర్భందాలు పెట్టిన మా పోడుదక్కేవరకు పోరాటం ఆగేదిలేదని తేగేసి చెప్పారు.

## ఖమ్మంలో చర్చిద్దాం రండి - ఎఫ్‌డీవో వెంకన్ననాయక్

ప్లాంటేషన్ పనులకు అడ్డుచెప్పవద్దని ప్లాంటేషన్ పోడుదారుల సమస్యలపై ఖమ్మం ఫారెస్టు కార్యాలయంలో చర్చిద్దామని ఎఫ్‌డీవో వెంకన్ననాయక్ అన్నారు. పోడుదారులతో మాట్లాడిన ఆయన జేసీబీలను వదిలివేయాలని రెండురోజుల తర్వాత సమస్యలపై చర్చిద్దామన్నారు. దీంతో పోడుదారులు జేసీబీలను వదిలివేశారు.



# అభివృద్ధి పనుల భూ సేకరణ స్పీడ్ అప్ చేయాలి.... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు కేటాయించే లే-ఔట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

రోప్ వే నిర్మాణానికి అవసరమైన స్థలం పర్యాటక శాఖకు బదిలీ చేయాలి

కలెక్టరేట్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వే వంటి అభివృద్ధి పనుల భూసేకరణ అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్







అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ స్పీడ్ అప్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వే వంటి అభివృద్ధి పనుల భూ సేకరణ అంశాలపై బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు.మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్ లను కేటాయిస్తున్నామని అన్నారు. రైతులకు అందించే లేఔట్ ప్లాట్ లలో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్ , విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతులకు లేఔట్ లో జరిగే అభివృద్ధి పనులు చూపించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు స్వచ్ఛందంగా అప్పగించేలా కృషి చేయాలని అన్నారు. లేఔట్ లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పనులకు డిజైన్ ఫైనల్ చేయాలని అన్నారు. హైదరాబాద్ లోని ప్రైవేట్ లేఔట్ తరహాలో మన లేఔట్ అభివృద్ధి చేయాలని, ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టమైన గడువు నిర్దేశించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రోప్ వే నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు ప్రత్యామ్నా యంగా వైద్య కళాశాల సమీపంలో ప్లాట్ లను ఇస్తున్నామని, అక్కడే హై వే కూడా వస్తుందని, మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. పట్టాల పంపిణీ తరువాత వెంటనే పర్యాటక శాఖకు స్థలం బదలాయించాలని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల ఎంట్రీ, ఎగ్జిట్, సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగాలని అన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సెప్టెంబర్ 9వ తేదీ నుండి ప్రారంభం

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

గుర్తింపుపొందిన ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైల్ ఈ యాత్ర సెప్టెంబర్ 9వ తేదీ నుండి







ప్రారంభమవుతుందని , పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రను శ్రీకారం చుట్టామని స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ %చ% టూర్ టైమ్స్ డైరెక్టర్ జీ.విఘ్నేష్ తెలిపారు . గూడూరు , నెల్లూరు , ఒంగోలు , చీరాల , గుంటూరు , మిర్యాలగూడ , నల్గొండ , హైదరాబాద్ , కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు . ఈ యాత్ర పదిహేను రోజులు జరగనుందన్నారు . ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైలు , భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్ టైమ్స్' ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు . ఈ యాత్రలో ఉజ్జయిని , ఓంకారేశ్వర్ , ద్వారకా , సిద్ధ పూర్ , మధుర , అయోధ్య , ప్రయాగ్ రాజ్ , వారణాసి , గయ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను కవర్ చేయనున్నామని చెప్పారు . గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకు విశేష స్పందన లభించిందన్నారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ , తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు . ఈ సందర్భంగా టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు , పురాణాల ప్రకారం ఈ యాత్రలో ఉన్న క్షేత్రాలు ఎంతో పేరుగాంచాయన్నారు . ఇవి మానవ శరీరంలోని వివిధ శక్తి కేంద్రాలను సూచిస్తాయని చెప్పారు . అవి.. అయోధ్య (మస్తు), మధుర (హృదయం), కాశీ (సహస్రార చక్రం), ఉజ్జయిని (నాభి), ద్వారక (పాదాలు), గయ (పితృ మోక్ష స్థలం), మాతృ గయ (మాతృ మోక్ష స్థలం) అన్నారు . ఈ ప్రత్యేక టూరిస్ట్ రైలు యాత్రికులకు పలు అనుభవాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు . ఈ రైలులో లోపల , బయట దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉంటుందన్నారు . లగేజ్ భారం ఉండదన్నారు . దర్శనానికి అవసరమైన బ్యాగ్ మాత్రమే మోయాల్సి ఉంటుందని చెప్పారు . ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు . థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ (డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500 అన్నారు . ఈ యాత్ర టికెట్లను ఫోన్ 93550 21516 కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు . ఆన్లైన్ బుకింగ్ కోసం %షఓష్.శీబతీఅఎఎం.అ% సంద్రించవచ్చన్నారు . ఈ సమావేశంలో టూర్ టైమ్స్ మేనేజర్ యాకేశ్ పాల్గొన్నారు . ఆసక్తి గల వారు టికెట్స్ బుక్ చేసుకొండి మరింత సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లు సంప్రదించవలసిందిగా 9848343882 , 6303093338 కోరారు .

# బొగ్గు గనులు మూసేసిన ప్రాంతాల్లో అక్కడి ప్రజల జీవనోపాధికి ఏం చర్యలు చేపడుతున్నారు..?

జస్ట్ ట్రాన్సిషన్ పనితీరును మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలేంటి?

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల వివరాలు తెలపండి..?

జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు తీరు, రేషన్ కార్డుల జారీ పురోగతి చెప్పండి..?


లోక్ సభలో మూడు ప్రశ్నలు అడిగిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి

లిఖితపూర్వక సమాధానాలిచ్చిన కేంద్ర మంత్రులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

బొగ్గు గనులు మూసేసిన ప్రాంతాల్లో అక్కడ నివసిస్తున్న ప్రజల జీవనోపాధికి ఏం చర్యలు చేపడుతున్నారు..? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం.. మూడు ప్రశ్నలు అడిగారు. బొగ్గు గనులకు సంబంధించి జస్ట్ ట్రాన్సిషన్ పనితీరును మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలు, మరో రెండు ప్రశ్నల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల వివరాలు, జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు తీరు, రేషన్ కార్డుల జారీ వివరాలు కోరారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి జి. కిషన్ రెడ్డి, విద్యుత్, కొత్త పునరుత్పాదక ఇంధనం శాఖల సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా లు లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఈ ఏడాది జనవరి 31న జారీ చేసిన మైనింగ్ ప్లాన్ మరియు గనుల మూసివేత మార్గదర్శకాల ప్రకారం.. ప్రభావిత కుటుంబాల కోసం పునరావాస చర్యలు చేపడుతున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కార్మికులు, సంఘాలు మరియు పర్యావరణం పై ప్రతికూల ప్రభావాలు తగ్గించే ట్రాన్సిషన్ విధానాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. లి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి శిక్షణల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. గనుల పర్యాటక ప్రదేశాల వృద్ధి, సౌర ప్రాజెక్టుల స్థాపన, ఖాళీ గనుల్లో చేపల పెంపకం, కోల్ - నీర్ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు.

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల వివరాలను.. కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ తెలుపుతూ... పునరుత్పాదక ఇంధన అమలు సంస్థలు ( ఆర్ఈ ఐఏఎస్ ) జారీ చేసిన టెండర్లకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ( ఎస్ఈసీఐ ), ఎన్టీపీసీ తదితర సంస్థలతో కలుపుకుని..ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి 43,922 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం కలిగి ఉన్నట్లు చెప్పారు. విద్యుత్ అమ్మకపు ఒప్పందాల ( పీపీఏఎస్ )ను కేంద్రం వేగవంతం చేసిందని, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు బిడ్డింగ్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం అమలు తీరుపై కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా లిఖితపూర్వక సమాధానం ఇస్తూ..గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50 శాతం వరకు జనాభా ఆహార అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 81.35 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు పేర్కొన్నారు. అత్యంత పేద కుటుంబాలకు నెలకు 35 కిలోల ఆహార సరుకులు సరఫరా చేస్తున్నామని, డిజిటలైజేషన్, ఆధార్ సీడింగ్, నకిలీల గుర్తింపు, లబ్ధిదారుల మరణాలు, వలసల కారణంగా.. 5.87 కోట్ల రేషన్ కార్డులను తొలగించినట్లు వివరించారు.



# ఏ సమస్య వచ్చిన నేనున్న...





**అక్షర కలం /ప్రతినిధి : హైదరాబాద్**

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన నేనున్న అంటు భరోసా ఇస్తున్న మన వెంకన్న.. ప్రజల ప్రభుత్వంలో ప్రజా పాలనకు నిదర్శనం ఇలాంటి ఎన్నో సందర్భాలు..ఈ రోజు బంజారాహిల్స్ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి కార్యాలయంలో రాష్ట్ర నలుమూలల నుండి పలు సమస్యలతో వచ్చిన ప్రజలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారిని కలిసి వినతి పత్రాలు అందించారు వాటిని తక్షణమే పరిష్కరించేలా అధికారులను ఆదేశించి వారికి భరోసా ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు.

# పదవీవిరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్



**అక్షర కలం /ప్రతినిధి నల్లగొండ**

జిల్లా పోలీసు శాఖలో దాదాపు 38 సంవత్సరాల పాటు పని చేస్తూ పదవి విరమణ పొందిన ఏఎస్ఐ లు దేవసాయం,ప్రభాకర్ రెడ్డి లను జిల్లా పోలీస్ కార్యాలయంలో యస్.పి గారు ఘనంగా సత్కరించి వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయం అని అన్నారు. మీ యొక్క సేవలు, అనుభవాలు పోలీస్ శాఖకు చాలా అవసరం ఉంటాయని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం అని, పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని అన్నారు. పదవి విరమణ పొందిన అనంతరం కూడా పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. అనంతరం వారికీ అందవలసిన ఆర్దిక సదుపాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన హెూంగార్డు కు 15 లక్షల భీమా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

గత ఏడాది నవంబర్ లో విధులకు వెళ్తున్న ఖమ్మం యూనిట్ కు చెందిన హెూంగార్డు బాణాల రామచారి కి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రముగా గాయపడి తన కాలు కోల్పోయాడు..ఈ నేపథ్యంలో యాక్సెస్ బ్యాంక్ సాలరీ అకౌంట్తో వచ్చే ప్రయోజనాలు మరియు ప్రమాద బీమా సొమ్ము రూ. 15 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా హెూంగార్డు కు అందజేశారు. కాలు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్న హెూంగార్డు కుపోలీస్ కమిషనర్ సూచనలతో వైరా ఎస్ఐ రామారావు చొరవ తీసుకుని విజయవాడ కు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు గారి ఆర్థిక సహాయంతో ఇటీవల అదునాతన కృత్రిమ కాలు అందించడం జరిగింది.ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభినందించారు.ఆర్ సుశీల్ సింగ్, హెూమ్ గార్డ్ % సురేష్, వైం రామారావు , హెూంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంక శ్రీను, వెంకటేశ్వర్లు, డి రవిబాబు, సిహెచ్ నాగరాజు, డి రమేష్, రహీమ్, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# కార్పొరేట్ పేర కమర్షియల్ కాలేజీలు

**- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్యాకేజీల పేరుతో నిలువుదోపిడి**

**- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్**

**- స్తబ్దంగా ప్రభుత్వ చర్యలు**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం: కాలేజీలో జాయిన్ అయ్యే టైం వచ్చిందంటే చాలు తల్లిదండ్రులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతాయి. మా పిల్లల్ని ఏ కాలేజీలో చేర్పించాలని,విద్యార్థులు ఏ గ్రూపు తీసుకోవాలని సందిగ్ధంలో పడుతుంటారు. ఇదే అదనుగా ప్రయివేటు కళాశాలలు యాజమాన్యం, స్టాఫ్ విద్యార్థుల లక్ష్యం ఏంటో తెలుసుకోకుండా.. లేనిపోని సలహాలిస్తూ స్వలాభం కోసం లెనిపోని అపోహలను గురిచేసి కార్పొరేట్ విద్య అంటూ అధిక ఫీజులు, ప్యాకేజీ పేర తల్లిదండ్రులను మభ్యపెడుతూ దండిగా ఫీజులు చెబుతూ నిలువుదోపిడి





చేస్తున్నారు. సొంత లాభం కొంత మానుకో.. పొరుగు వారికి తోడ్పడవోయ్ అనే గురజాడ మాటలు పక్కన పెట్టి మరీ కార్పొరేట్ విద్య అంటూ కమర్షియల్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్యాకేజీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు వసూళ్లు చేయాలని చెబుతున్నప్పటికీ మాకేమి పట్టనట్టు పలు ప్రయివేటు కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్పొరేట్ కాలేజీల ఫీజులపై అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్...







**అక్షర కలం/ ప్రతినిధి**

ఆగస్టు 4న నల్లగొండలో 22 ఎకరాల్లో, రూ. 200 కోట్ల వ్యయంతో ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరగనుంది.ఈ స్కూల్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు ఉత్తమ వసతులు, స్కిల్ డెవలప్మెంట్ బ్లాకులు, క్రీడా మైదానాలు, అకాడెమిక్ %డ% స్టాఫ్ బిల్డింగ్స్ ఉండేలా అధికారులతో సమీక్ష నిర్వహించారు.అదే రోజు ప్రారంభమయ్యే నూతన మంత్రి క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కూడా సమీక్ష నిర్వహించబడింది. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం నల్లగొండకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు..

# మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఆకస్మిత తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**కేసుల దర్యాప్తు విషయంలో సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి..**

**శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలు అందుబాటులో ఉంటూ పని చేయాలి**

**అక్షర కలం /ప్రతినిధి**

దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఆకస్మిత తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు,స్థితిగతులు గురించి యస్.ఐ ను అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం శిక్ష పడే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నేర నియంత్రణకు కృషి చేయాలని, బ్లూ కోల్ట్ , పెట్రో కార్ డ్యూటీ లో ఉన్నప్పుడు 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు,ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది పని చేయాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పిడియస్ రైస్ అక్రమ రవాణా,జూదం లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని , పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ కి వచ్చిన పిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్.ఐ గారిని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక ఐపీఎస్,ఎస్.ఐ కృష్ణా రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.









# పట్టుదలకు కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం......

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువులో రాణించాను**

**సమర్థవంతంగా విధుల నిర్వహణకు క్షేత్రస్థాయి అనుభవం దోహదపడుతుంది**

**2024 ఐఏఎస్ బ్యాచ్ లో 11వ ర్యాంక్ సాధించిన సాయిశివాని అభినందించిన జిల్లా కలెక్టర్**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

మనలో ఉన్న పట్టుదలకు, కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.2024 ఐఏఎస్ బ్యాచ్ లో 11వ ర్యాంక్ సాధించిన తెలంగాణ, వరంగల్ కు చెందిన ఇ. రాజు, రజిత దంపతుల కుమార్తె ఇ. సాయి శివాని తల్లిదండ్రులతో కలిసి బుధవారం ఖమ్మం కలెక్టరేట్, కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్, సాయి శివాని, ఆమె తల్లిదండ్రులకు శాలువా కప్పి కలెక్టర్ సన్మానించి అభినందనలు తెలిపారు.





Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955